పురో — (ముందుకు వచ్చి) ఇదిగో తపస్వులు విధ్యుక్తముగా నర్చింపఁబడినవారు. ఏదో వీరియుపాధ్యాయులు పంపిన సమాచారము కలఁదట! దేవా! వినఁదగును.

రాజు — సావధానచిత్తుఁడ నయి యున్నాను.

ఋషులు — (చేతులెత్తి) రాజా! నీకు జయ మగుఁగాక!

రాజు — మీకందఱకును నమస్కరించుచున్నాను.

ఋషు — ఇష్టార్థసిద్ధి యగుగాక!

రాజు — మీ తపస్సులు నిర్విఘ్నముగా సాగుచున్నవా?

ఋషు — గీ. సాధుసంరక్షణము నీవు సలుపుచుండ
సత్క్రియల కెట్లు విఘ్నముల్ సంభవించు?
బెట్టుగ సహస్రకిరణుండు వెలుఁగుచుండఁ,
బుడమి నంధకారం బెట్లు పుట్టనేర్చు.

రాజు — నా రాజశబ్ద మిప్పుడుగదా సార్థకమయినది! పూజ్యుఁడయిన యా కణ్వమహాముని లోకానుగ్రహముకొఱకుఁ గుశలియై యున్నాఁడా?

ఋషు — తపస్సిద్ధి గలవారికిఁ గుశలము స్వాధీనమే. ఆయన కుశలప్రశ్నపూర్వకముగా మీకిట్లు చెప్పు మనియె.

రాజు — ఆయన యేమని యాజ్ఞాపించినారు?

శార్ఙ్గ — "అన్యోన్యసంకేతముచేత నీవు మాపుత్రికను వివాహమాడుట మీ యెడఁ గల ప్రీతిచేత నే నంగీకరించినాఁడను. ఎందుచేత నన —

గీ. యోగ్యతములలో నగ్రగణ్యుండ వీవు;
భువి శకుంతల రూపొందుపుణ్యరాశి;
తుల్యగుణయుక్తులగు దంపతులను గూర్చి,
బ్రహ్మ చిరకాలమునకును బాసె నింద.

కాఁబట్టి, గర్భిణియైన యీమెను సహధర్మాచరణమునకు స్వీకరింపవలయును” అని.

గౌత—అయ్యా! నాకును గొంతచెప్ప నిచ్ఛ గలదు. కాని నా వచనమున కవకాశము లేదు. ఎందుచేతనన —

గీ. గురుజనులయిష్ట మీయమ కోర దయ్యె;
నా ప్తబంధుల మీరును నడుగరైతి;
రిల్లు మీలోనె మీ రొనరించుకొన్న
పనికి నొండొరులకు నేమి పలుకవలయు!

శకుం—(తనలో) భర్త యేమి పలుకునో?

రాజు—ఇవి యేటి మాటలు?

శకుం—(తనలో) ఈ వాగ్విజృంభణము నా కగ్నిహోత్రముగా నున్నది.

శార్ఙ్గ—ఏమి మీ తాత్పర్యము? మీరు లోకవ్యవహారమున మిక్కిలి ప్రవీణులుగదా!

గీ. పుట్టినింటనె పతిగలపొలఁతి యున్న
జనులు శంకింతు రన్యథా సాధ్వియైనఁ;
గావునను దదప్రియ నైనఁ, గాంత నెపుడు
బంధుజను లుంచఁదలఁతురు భర్త కడనె.

రాజు—ఏమి? మీమానిని పూర్వము నాచేత వివాహమాడఁబడినదా?

శకుం—(విషాదముతో మనసులో) హృదయమా! నీకిప్పుడు బెడద సంభవించినది.

శార్ఙ్గ—ఏమి? చేసినపనియెడ ద్వేషమును, ధర్మము తప్పుటయు రాజునకుఁ దగునా?

రాజు—ఎందుచేత మీ రీ యసత్యకల్పనఁ గల ప్రశ్న వేయుచున్నారు?

శార్ఙ్గ— ఈ వికారములు తఱుచుగా నైశ్వర్యమత్తులకు బుట్టెడివే.

రాజు—నన్ను మిక్కిలి తిరస్కరించుచున్నారు!

గౌత—బిడ్డా! నీవు క్షణమాత్రము సిగ్గుపడకు. ఇప్పుడు నీ మేలిముసుఁగును తీసెదను. అందువలన నీ భర్త నిన్నానవాలుపట్టును.

(అని యట్లు చేయుచున్నది.)

రాజు—(శకుంతలను జూచి తనలో)

చ. ఎదురను గానిపించు నిదె నీ యసమాన సురూప హార! నే
సిది మొదలం గ్రహించితినొ యే గ్రహింపనొ నిశ్చయింప లే
నెద, హిమపూర్ణకుందమున కేగి ప్రభాతమునందుఁ గాంచు తు
మ్మెద కరణిం ద్యజింపను దమిం గ్రహియింపను జాల నిత్తఱిన్.

ప్రతీ—ఆహా! రాజు ధర్మదృష్టి! అనాయాసముగా లభించిన యిటువంటి రూపమును జూచి మఱి యెవ్వఁ డాలోచించును?

శార్ఙ్గ—రాజా! యేమి యూరకున్నావు?

రాజు—ఓ తపోధనా! ఎంతయాలోచించినను నే నీమెను బరిగ్రహించుట స్మరణకు రాలేదు. అట్లుండఁగా స్పష్టముగాఁ గనఁబడుచున్న గర్భచిహ్నములుగల యీమెను నే నెట్లు భార్యనుగా నంగీకరింపుదును?

శకుం—(తనలో) ఈయనకు వివాహవిషయముననే సందేహము కలిగినది. ఇఁక దూరము పోయిన నా యాశ యెందుకు?

శార్ఙ్గ—ఇది నీకుఁ దగదు.

గీ. దొంగిలిన సొత్తు దండ్యుఁడౌ దొంగకడకె
మరలఁ బంపిన కరణి, నహ్మాని నీవు
కైకొనిన యాత్మతనయను గౌరవమున
నీ కడకుఁ బంపుట నతండె నింద్యుఁ డిపుడు.

గౌత—శార్ఙ్గరవా! నీవిప్పు డూరకుండుము! ఓ శకుంతలా! మేము చెప్పఁ దగినది మేము చెప్పితిమి. అందున కితఁ డీ విధముగఁ బలుకుచున్నాఁడు. ఈయనకు నమ్మకము పుట్టునట్లు ప్రత్యుత్తరము నీవు చెప్పుము.

శకుం—(తనలో) అటువంటి యనురాగమున కిట్టిగతి పట్టినప్పుడు నేను దలపించిన ప్రయోజన మేమి? ఇక నన్ను గుఱించి నేను దుఃఖపడవలసినదే. నిశ్చయము (ప్రకాశముగా) ప్రాణేశ్వరా! (అని సగము చెప్పి) ఇప్పుడు వివాహమునందే సంశయము గలిగినది గనుక, ఇట్లు పిలువఁ దగదు. ఓ పౌరవా! నా డా ప్రకారముగా దపోవనమునందు స్వభావముచేత బేలహృదయముగల నన్ను నీవెన్నో బాసలు చేసి మోసపుచ్చి యిప్పు డీవిధమయిన మాటలచేత నన్ను నిరాకరించుట నీకుఁ దగునా?

రాజు—(చెవులు మూసికొని) పాపము శమించునుగాక!

గీ. వసుధఁ గూలంకషనదీప్రవాహ మచ్ఛ
జలమును దటస్థతరువును గలఁచునట్లు,
మామక కులప్రశస్తిని మాప, నన్నుఁ
బాతకునిఁ జేయనుం బాటుపడెద వేల?

శకుం—మంచిది! తమకు నిజముగాఁ బరభార్యయను శంకచేతనే యిట్లయితిరేని, ఈ యానవాలుచేతఁ దమసందేహనివారణము చేసెదను.

రాజు—ఇది యుత్తమపక్షము.

శకుం—(ఉంగరపువ్రేలు తడవి) నా వ్రేలి యుంగరము లేదు. (అని విషాదముతో గౌతమిని జూచుచున్నది.)

గౌత—శక్రావతారములో శచీతీర్థోదకమునకు నీవు మ్రొక్కినప్పుడు నీ యుంగరము జాఱిపోయినది కాఁబోలును!

రాజు—(చిఱునవ్వు నవ్వి) ఇందుచేతనే స్త్రీలు సమయోచిత బుద్ధి కలవా రని చెప్పుదురు.

శకుం.—ఇందులో విధి యిప్పుడు తన సామర్థ్యమును జూపెను. మీకు మఱి యొకటి చెప్పెదను.

రాజు—ఇప్పుడు చెప్పెడుదాని న్వినవలయును.

శకుం—ఒకనాఁడు నవమాలికా మండపమునందుఁ దామరాకు దొప్పలోని నీరు తమచేతిలోఁ బోసికొంటిరి.

రాజు—వినుచున్నాఁడను. అనంతరము ?

శకుం—ఇంతలో నా పెంపుడుబిడ్డయైన దీర్ఘాపాంగ మను లేడిపిల్ల సమీపమునకు వచ్చెను. మీరు కనికరము గలవా రయి నీవే ముందుగా నీరు ద్రాగుమని నీరు చూపి దానిని పిలిచితిరి. పరిచయము లేకపోవుటచేత నది మీచేతి సమీపమునకు రా దయ్యెను. పిమ్మట నీరు నేను చేతఁ బట్టుకోఁగానే యది స్నేహము చేత దగ్గఱకు వచ్చెను. అప్పుడు నన్ను మీరీవిధముగా మేల మాడి తిరి—అందఱును బంధువులయెడ విశ్వాస ముంతురు; మీ రిరువురును నరణ్యసంభవులు – అని.

రాజు—స్వకార్యనిర్వాహణ లయిన స్త్రీ లీ మొదలయిన తేనె లొలుకు కల్ల మాటలతో భోగపరాయణుల నాకర్షింతురు.

గౌత—ఓ మహాభాగా ! ఇట్లు తలంపఁదగదు. తపోవనమునందుఁ బెరిఁగిన యీమె కపటమెఱిఁగినది కాదు.

రాజు—ఓ వృద్ధతపస్విని !

చ. అరయఁగ మానవేతరములై తగుజంతువులందు స్త్రీలలోఁ
గరము నిసర్గపాటవము గన్పడఁ, జెప్పగనేల ప్రాజ్ఞలౌ
తిరుణులమాట ? తాఁ బరభృతప్రకరం బితరద్విజాలి నం
బరమున కేగుదాఁక, బెను పంగ నొనర్చదె కన్నబిడ్డలన్ ?

శకుం—(రోషముతో) కుత్సితుఁడా! నీ హృదయానుమానము చేత నితరుల నట్లేచూచుచున్నావు. పైకి ధర్మకవచమును దొడిగి గడ్డి కప్పియున్ననూతివలె నున్న నిన్నెవ్వరు పోలఁగలరు?

రాజు—(తనలో) నాకు మనస్సునందు సందేహము పుట్టించుచు, కపటములేనియట్లే యీమె కోపము కనఁబడుచున్నది. అట్లేకదా?

చ. స్మరణకురాక క్రూరముగ స్వాంతములోపలఁ దాపమొందుచున్
గరము రహస్యపుం బ్రణయగాథ యెఱుంగఁగలేని నాపయిన్
దరుణి యపారకోపమునఁ దద్దయు నేత్రము లెఱ్ఱఁ జేసి వం
కర లగు కన్బొమల్ విఱుచు గా స్మరచాపవిఖండనక్రియన్!

(ప్రకాశముగా) ఓ కళ్యాణీ! దుష్యంతునినడత యందఱకుం దెలిసినదే. అయినను నే నిది తెలియఁజాలకున్నాను.

శకుం—మేలు! పూరువంశజుఁడను నమ్మకముచేత నాలుక తేనెయు హృదయము విషము నైన వాని చేతఁబడి నే నిక్కడ స్వచ్ఛందసంచారిణిగాఁ జేయఁబడితిని.

(అని చీరచెఱఁగుతో ముఖము కప్పుకొని యేడ్చుచున్నది.)

శార్ఙ్గ—ఈలాగువ స్వతంత్రించి బుద్ధిలేనిపని చేసినందుకుఁ దాప మనుభవింపవలసినదే.

గీ. ఏకతమ బాంధవము సల్పునెడలఁ దాను
బదిగఁ బరికించి మఱి చేయవలయు నెపుడు;
హృదయ మెఱుఁగక వరులతోఁ బదరి చేయు
సౌహృదమె విరోధ మగు నీ చందముననె.

రాజు—అయ్యో! ఏమి మీరును నీమెమాటలనే నమ్మి నా యందే దోషారోపణము చేసి నన్ను నిందించుచున్నారు!

శార్ఙ్గ—(అనసూయతో) నావ్యత్యస్తవాక్యమును దమరు చిత్తగించవలయును.

గీ. అప్రమాణంబె యగు జన్మ మాదిగాఁగ
సతిముఁ గౌటిల్య మెఱుఁగని జనముమాట;
అన్యవంచనమే విద్యయట్లు నేర్చు
వారెపో సత్యవాదులు వసుధమీఁద.

రాజు—ఓసత్యవాదీ! మీరు చెప్పినప్రకారమే నేనొప్పుకొనియెదను. ఈమెను వంచించుటవలన మాకేమిలాభము?

శార్ఙ్గ—పాపము.

రాజు—ఓయీ! పౌరవులు పాపమును గోరుదురనుట నమ్మఁదగినదికాదు.

శార్ఙ్గ—శారద్వతా! మనకు మాఉత్తరముతో నేమి ప్రయోజనము? మనము గురుసందేశమును నిర్వర్తించితిమి. ఇఁక వెడలిపోవుదము. (రాజుతో)

క. ఈవెలఁదుక నీభార్యయె
యీవేలిన నేలుకొమ్ము, యేలక యున్నన్
బో విడువు, మాంద్రయెడఁ బతు
లే విను సర్వాధికారు లిల నన్నిఁటికిన్.

గౌత—ముందు నడువుఁడు.

(అని యందఱును బయలు దేఱుచున్నారు)

శకుం—ఈ కుత్సితునిచేత మోసపోతిని. ఇఁక నాగతియెట్లు? దుఃఖములో మునిఁగియున్న నన్ను మీరును విడిచిపెట్టెదరా?

(అని వెంటఁబడుచున్నది)

గౌత—(నిలిచి) వత్సా! శార్ఙ్గరవా! పాపము శకుంతల దైన్యముతో విలపించుచు మావెంట వచ్చుచున్నది. భర్తచే క్రూరముగా వదలిపెట్టఁబడి బిడ్డ యేమి చేయఁగలదు?

శార్ఙ్గ—(రోషముతో వెనుక తిరిగి) ఓసి దుర్మార్గురాలా? ఏమి? స్వాతంత్ర్యము నవలంబించుచున్నావు!

(శకుంతల భయముచేత వడకుచున్నది.)

శార్ఙ్గ—శకుంతలా!

గీ. అవనిపతి యన్నయట్లు నీవగుదు వేని,
కులము చెడిన నీ వేల నీకూర్మిపితకు?
నీచరిత శుద్ధ మంచును నీ వెఱింగి
తేని, పతియింట దాస్యంబె హితము నీకు.

నిలువు. మేము వెళ్ళెదము.

రాజు—ఓ తపస్వీ? ఈమె నేల దూషించెదవు?

గీ. కుముదంబులకే శశియును
గమలంబులకే రవియు వికాస మొసంగుఁ;
స్వమన మటు జితేంద్రియులకు
విముఖం బగుఁ బరవధువుల బిగికౌఁగిలికిఁ.

శార్ఙ్గ—అన్యసంగముచేతఁ బూర్వవృత్తాంతమును మఱచి పోయి యున్నప్పు డధర్మభీరుత్వ మెట్లు కలుగును?

రాజు—(పురోహితునితో) ఇందులో గురుత్వలఘుత్వములు మిమ్మే యడుగుచున్నాను.

గీ. ఏనె మూఢుఁడ నైతినో, యీమె కల్ల
లాడెనో యని సంశయమయిన యిప్పు
డే స్వభార్య విడుచువాఁడనే యగుదునో?
యన్యసతి నంటుపాతకి నగుదు నో కొ?

పురోహితుఁడు—(ఆలోచించి) ఇప్పు డిట్లు చేయనచ్చును.

రాజు—తమ రాజ్ఞ యియ్యవలెను.

పురో॥—ఈమె ప్రసవమగువఱకును నాయింట నుండవచ్చును. అట్లేల చెప్పెద వంటిరేని, మీరు చక్రవర్తియగు పుత్రునిఁ గందురని యీవఱకే పెద్దలు చెప్పియున్నారుగదా! మునిదౌహిత్రుఁడాలక్షణములు గలవాఁడయినపక్షమున, సంతోషపూర్వకముగా నీమెను దమ రంతఃపురమునకు రప్పించుకొనుఁడు. మఱియొకలాగయ్యేనేని యీమెను దండ్రికడకుఁ బంపుట యుండనే యున్నది.

రాజు—గురువుగారి యిష్టానుసారము చేయుఁడు.

పురో॥—బిడ్డా! నా వెంటరమ్ము.

శకుం—ఓభూదేవీ! నీలోనికి నాకు దారి యిమ్ము. (అని యేడ్చుచుఁ బురోహితునితోడను దపస్వులతోడను, నడచుచున్నది.)

(రాజు శాపముచేత జ్ఞప్తిలేనివాఁడయి శకుంతల సంగతియే యాలోచించుచున్నాఁడు.)

[తెరమఱుఁగున] ఆశ్చర్యము! ఆశ్చర్యము!

రాజు—(ఆలకించి) అదియేమయి యుండునో!

పురో॥—(ప్రవేశించి విస్మయముతో) దేవా! అద్భుతము పుట్టినదిగదా?

రాజు—అది యేమి?

పురో॥—దేవా! కణ్వశిష్యులు మరలఁగానే—

గీ. తనయదృష్టంబు నిందించుకొనుచు బాల
బాహు లెగనెత్తి యేడ్వ నుపక్రమించె?

రాజు—తరువాత నేమి సంభవించినది?

పురో॥—అప్సర స్తీర్థమున మింటి కామెఁ గొనుచు
నెగసె వెసఁ గాంతిరాశిగా యింతి యొకతె.

(అందఱు నాశ్చర్య పడుచున్నారు.)

రాజు—భూదేవా! ఆమెను మనము ముందే విడిచిపెట్టితిమి. వ్యర్థ మయిన విచారముతో మీ రేల వెదకెదరు! విశ్రాంతిఁ బొందుఁడు.

పురో—(చూచి) విజయ మగుఁగాక! (అని నిష్క్రమించు చున్నాఁడు.)

రాజు—వేత్రవతీ! నామనస్సు వ్యాకులముగా నున్నది. పడక గదికి మార్గము చూపుము.

ప్రతీ—దేవా! ఈలాగు. ఈలాగు. (అని బయలుదేఱు చున్నది.)

రాజు—గీ. ఏ నిరాకరించిన తాపసేంద్రసుతను
దారనుగ నెంతిమాత్రంబుఁ దలఁప నేను;
డెంద మట్లయ్యు సంతాప మొందు చిపుడు
ప్రత్యయము పుట్ట బోధించుచపగిది నుండె.
(అని యందఱును నిష్క్రమించుచున్నారు.)

పంచమ షష్ఠాంక మధ్యమునందు ప్రవేశకము

రంగము-రాజమందిర ద్వారము

[అప్పుడు పురితలవరి యగు శ్యాలకుఁడు పెడకేలు గట్టిన యొక పురుషుని తీసికొని రక్షకభటులతోఁ బ్రవేశించుచున్నాఁడు.]

రక్షక—(వానిని గొట్టి) ఓరి దొంగా! రత్నముం దాఁపునపుడు పేరుచెక్కిన రాజుగారి యీ యుంగరము నీకెక్కడనుండి వచ్చినది? చెప్పు.

పురు—(భయమునటించుచు) అయ్యలారా! దయచేయుఁడు. నేనిటువంటిపని చేయువాఁడను గాను.

ప్రథముఁడు—ఓరీ! నీవు సద్బ్రాహ్మణుఁడ వని విచారించి పరిగ్రహింపుమని రాజుగారు నీకీ దాన మిచ్చినారురా?

పురు—ఇప్పుడు నేఁ జెప్పునది వినుఁడు. నేను శక్రావతార తీర్థ సమీపవాసి నైన బెస్తను.

ద్వితీయుడు—ఓరిదొంగా! మేము నీజాతి యడిగినాముగా?

శ్యాలకుఁడు—ఈ చోరుని నంతయు వరుసగాఁ జెప్పనిండు. వీనిని మధ్య నడ్డు పెట్టవలదు.

రక్ష—ఆయన యాజ్ఞాపించినప్రకారము చెప్పుడు.

పురు—నేను వల, గాలము మొదలయిన చేపలను బట్టు సాధనములచేతఁ గుటుంబభరణము చేసికొనుచున్నాను.

శ్యాల—(నవ్వి) ఇప్పుడు నీజీవనము బహుపరిశుద్ధమయినది.

పురు—దేవా! తమ రట్లు సెలవియ్యరాదు.

గీ. గర్హితమె యైనను, స్వజాతికర్మ మెపుడు
వదలఁ గూడదుగాదె యెవ్వారలకును;
శ్రోత్రియుఁడు పశుమారణకర్మచేత
దారుణుండైన మృదునెయగా దయను బూని!

శ్యాల—తరువాత, తరువాత.

పురు—ఒకనాఁడు నేనొక యెఱ్ఱచేపను గోసితిని. అప్పుడు దానికడుపులో రత్నప్రభాభాసురమయిన యీ యుంగరము కనఁబడినది. తరువాత నేను దీని నమ్మజూచుచు మీఁచేత బట్టుపడితిని. మీరు నన్నుఁ జంపిననుసరే, విడిచిననుసరే. ఇది వచ్చిన విధమింతే.

శ్యాల—జానుకా! పొలసుకంపును వికారరూపమునుగల వీఁడు నిస్సంశయముగా జేఁపలవాఁడే. వీనికీ యుంగరము వచ్చుటయే విచారింపవలయును. మనము రాజగృహమునకుఁ బోవుదము.

రక్ష—మంచిది,—ఓరి దొంగా!

(అని యందఱు నడచుచున్నారు.)

శ్యాల—సూచకా! వీనిని పురద్వారమున నప్రమత్తులరై కాచి యుండుడు. ఇప్పుడీ యుంగరము వచ్చిన విధము రాజునకు నివేదించి యాతని యాజ్ఞ పొంగి వచ్చెదను.

రక్ష—అయ్యా! ప్రభువువారి యనుగ్రహ సంపాదనమునకయి పొమ్ము. (శ్యాలకుఁడు నిష్క్రమించుచున్నాఁడు.)

ప్రథముఁడు—జానుకా! శ్యాలకుఁ డాలస్యము చేయుచున్నాఁడు.

ద్వితీ—రాజులవద్ద సమయము కనిపెట్టి యనుసరింపవలయును గదా?

ప్రథ—జానుకా! వధ్యుఁ డయిన వీనికిఁ బూలు చుట్టుటకు నాచేతులు తొందరపడుచున్నవి. (అని వానిని జూపుచున్నాఁడు.)

పురు—స్వామీ! నన్నకారణముగాఁ జంపుట మీకుఁదగదు.

ద్వితీ—(చూచి) అదిగో! మాస్వామి, పత్రిక చేతఁ బట్టుకొని రాజుగారియాజ్ఞను బొంది యిటుమొగంబయి కనఁబడుచున్నాఁడు. ఓరీ! నీఁవిక గ్రద్దలకు బలియగుదువు. లేదా కుక్కలనోర నయినను బడెదవు.

శ్యాల—(ప్రవేశించి) సూచకా! ఈ పల్లెవానిని విడిచిపెట్టుము. వీనికీ యుంగరము వచ్చిన సంగతి సరిగానున్నది.

సూచ—దేవర యాజ్ఞాపించునట్లు చేసెదను!

ద్వితీ—వీఁడు యమమందిరముఁ జొచ్చి మరలవచ్చినాఁడు.

(అని వానికట్లు విప్పుచున్నాఁడు.)

పురు—(శ్యాలకునకు మ్రొక్కి) స్వామీ! ఇఁక నాకు జీవన మెట్లు?

శ్యాల—ఇదిగో రాజుగారు నీ కుంగరమువెలను గూడ బహుమానము దయచేసిరి. (అని వానికిఁ ధన మిచ్చుచున్నాఁడు.)

పురు—(నమస్కారపూర్వకముగాఁ బుచ్చుకొని) రాజుగారు నన్ను రక్షించినారు.

సూచ—ఒక్క రక్షించుటయే కాదు, నిన్నుఁ గొఱఁతనుండి దింపి యేనుఁగుమీఁది కెక్కించినారు.

జాను—అయ్యా! ఉంగరమునందు రాజుగారికి మిక్కిలి మక్కువ కలిగి యుండు నని యీ బహుమానమే చెప్పుచున్నది.

శ్యాల—అమూల్య మయిన యీరత్నమునందు రాజుగారికిఁ బ్రీతి గలదని యిందునుబట్టి నేననుకొను. దానిని జూచుటచేత వారి కిష్టజను లెవ్వరో తలఁపునకు వచ్చిరి. వారు స్వభావగంభీరులయినను ముహూర్తకాలము కన్నుల నీరు పెట్టుకొనిరి.

సూచ—శ్యాలకునకు రాజుగారిసేవ దొరికినదిగదా?

జాను—ఓయీ! ఈ చేపలదానిమగని లాభమునిమిత్త మని చెప్పు. (అని వాని వంక నసూయతోఁ జూచుచున్నాఁడు.)

పురు—అయ్యలారా! ఇందులో సగము మీకు సుహృద్భావము వెలగా నిచ్చెదను.

సూచ—ఈమాత్రము తగును.

శ్యాల—జాలరీ! ఇప్పుడు నీవు గొప్ప ప్రియమిత్రుఁడ వయితివి. మద్యము సాక్షిగా మనము ప్రథమమైత్రి చేసికొనవలెను. కాఁబట్టి కల్లంగడికే పోదము.

పురు—ఆలాగే.

(అని యందఱును నిష్క్రమించిరి.)

షష్ఠాంకము

రంగము—ప్రమదావనము

[అప్పు డాకాశయానముచేత సానుమతి యను నప్సరస ప్రవేశించుచున్నది.]

సాను—సాధుజనులు స్నానము చేయునంతవఱకు నప్సర స్తీర్థసన్నిధానమునందు నేను జేయఁదగిన పనిని నిర్వర్తించితిని గనుక ఇప్పుడా రాజర్షి యొక్క వృత్తాంతమును గనుఁగొనెదను. మేనక చుట్టఱికముచేత శకుంతల యిప్పుడు నాకు దేహసదృశయైనది. పుత్రికకొఱకామె నన్నిక్కడకుఁ బంపినదిగదా? (అంతటను జూచి) ఇదియేమో కాని వసంతోత్సవసమయమయినను, ఈ రాజగృహమునం దేమియు నుత్సవ మారంభింపనట్టు కనఁబడుచున్నది! నాకు ధ్యానముచేతనే సమస్తమును దెలిసికొను శక్తి కలదు. అయినను నా చెలియొక్క మాట మన్నింపవలయును; కాఁబట్టి యీ యుద్యానపాలకురాండ్ర కిద్దఱికిని దిరస్కరణీవిద్యచేతఁ గనఁబడక వీరిప్రక్కనే యుండి చూచెదను.

(అని దిగినట్టభినయించి నిలిచెను.)

[అప్పుడు మామిడిచిగురు చూచుచు నొకచేటికయుఁ దాని వెనుక మఱియొక చేటికయుఁ బ్రవేశించుచున్నారు.]

మొద—గీ. హర్ష మిచ్చుచుఁ బికముల, కలవసంత
మాసమునకును బ్రాణసమాన మగుచు,
తుమ్మెదలపాదములకు భంగమ్ము కూర్చు
చూతము ఋతుమంగళముగఁ జూతు నేను.

రెండవది—ఓ పరభృతికా! నీవొంటిగా నేమి యాలోచించు చున్నావు?

మొద—ఓ మధురికా! మావిమొగ్గను జూచి పరభృతిక యున్మత్త యగుచున్నది.

రెండ—(సంతోషముతో త్వరితముగావచ్చి) ఏమీ! వసంత కాలము వచ్చినదా?

మొద—మధురికా! నీకిప్పు డది మదవిభ్రమముగల పాటలకుఁ గాలము.

రెండ—సఖీ! నన్నుఁ బట్టుకొమ్ము. నే నిప్పుడు కొనకాళ్ళమీఁద నిలిచి మన్మథపూజకొఱకు మామిడిచిగుళ్లు కోసెదను.

మొద—పూజాఫలములో నాకును సగ మిత్తువేని పట్టుకొని యెదను.

రెండ—నేనడుగకపోయినను నీ కది సిద్ధించును. మనకు శరీరములు వేఱైనను ప్రాణ మొక్కటియేకదా! (అని సఖిని పట్టుకొని నిలిచి మామిడిచిగురు కోయుచున్నది.) ఓసీ! వికసింపకపోయినను మామిడిమొగ్గ తొడిమ త్రుంచుటచేత సువాసన కొట్టుచున్నది! (కపోతహస్తము పట్టి)

గీ. ఓ రసాలప్రవాళంబ! గొనుపర విన్ను
ధనువు చేతను దాల్చు కాముసకు నిత్తుఁ;
గావునను బాంథయువతిలక్ష్యంబ వగుచుఁ
బంచశరునకు నాఱవబాణ మగుము.

(అని మామిడిచిగురును జిమ్ముచున్నది.)

కంచుకి—(తెరచాటునుండి ప్రవేశించి కోపముతో) మీరు దేహము తెలియకున్నారు! ప్రభువువారు వసంతోత్సవము వలదని విశే

ధించి యుండఁగా మీరేల మావిమొగ్గలను గోయనారంభించినారు? కోయవలదు.

ఇద్దఱు—(భయపడి) అయ్యా! క్షమింపుము. మే మిది యెఱుఁగము.

కంచు—మీరు వినలేదా యేమి! ఈ వసంతమునఁ బూచు వృక్షములును వాని నాశ్రయించియున్న పక్షులనుగూడ రాజుగారి యాజ్ఞకు గట్టుపడినవి. ఎట్లన—

చ. చిరముగఁ బైకి వెల్వడియుఁ జిన్మను పుష్పొడి మావిమొగ్గయున్;
గురువనకమున్ దగ న్నిలిచెఁ గోరికరీతి నె సిద్ధమయ్యునున్;
బురుషపికంబు క్రిమింగె మతమున్ గళమందు నె శీత మేఁగియున్;
మరుఁ డుడిపెన్ శరంబు నెఱుమన్ వెఱఁ దూణమునుండితీయుచున్.

సాను— సందేహము లేదు. రాజేంద్రుఁడు మహాప్రభావ సంపన్నుఁడు.

మొద—అయ్యా! కొన్ని దినములక్రిందట రాజుగారి భావమఱఁది యగు మిత్రావసువు మమ్ము రాజుగారి చరణసన్నిధానమునుండి ప్రమద వనపరిపాలనకర్మ మిచ్చి పంపివేయుటచే నాఁటనుండి మేమిక్కడ నుండి నందున మాకీవృత్తాంతము తెలియలేదు.

కంచు—కానిండు. మీరిఁక నీప్రకారముగా నడవఁగూడదు.

ఇద్ద—అయ్యా! మాకు విన వేడుకగానున్నది. రాజుగారు వసంతోత్సవము నెందుచేత మాన్పినారో మేము వినఁదగినయెడలఁ జెప్పుడు.

సాను—మనుష్యు లుత్సవప్రియులు గదా? దీనికేదో గొప్ప కారణ ముండవలయును.

కంచు—ఇది వెల్లడియైనవిషయము. మీకుఁ జెప్పకపోనేల? రాజుగారికి శకుంతలను విడనాడుటవలనఁ గలిగిన లోకాపవాదము చెవిని బడలేదా యేమి!

ఇద్ద—ఉంగరమును జూచినంతపర్యంతము శ్యాలకునివలన విన్నాము.

కంచు—అందుచేఁ జెప్పఁదగినది కొంచెమేయున్నది. ఎప్పుడు తమ యుంగరమును జూచుటవలన రాజుగారు "పూజ్యురాలయిన శకుంతలను మేము రహస్యమున వివాహమాడినది సత్యమే. అజ్ఞానమువలన విడిచిపెట్టితి" మని తలఁచిరో యప్పుడు మొదలుకొని రాజుగారు పశ్చాత్తాపమును బొందుచున్నారు. ఎట్లన—

ఉ. ఒల్లఁడు రమ్యవస్తుతతియుం, గొలువియ్యఁడు మంత్రికోటికిం
దొల్లిఁటియట్ల ప్రత్యహము, దొర్లుచుఁ బాన్పున నిద్రలేక వ
త్రిల్లును రాత్రు, లంతిపురిఁ ద్రిమ్మరు కొమ్మలపేరు మార్చి రం
జిల్లు సగర్వవాక్యములు చెప్పి కడుం వెఱఁగొందు లజ్జచేఁ.

సాను—నాకు మనఃప్రియముగా నున్నది.

కంచు—అందుచేత మనస్సు వికలమయి రాజుగారు వేడుక మాన్పించినారు.

ఇద్ద—సరి! సరి!

(తెరలో) మీరు రండి. రండి.

కంచు—(ఆలకించి) కాంతలారా! రాజిక్కడనేయున్నాఁడు. మీరు మీపనియం దుండుఁడు.

ఇద్ద—ఆలాగే. (అని వెళ్ళుచున్నారు)

[అంతట పశ్చాత్తాపమునకు తగిన వేషముతో రాజును, విదూషకుఁడును, ప్రతీహారియు ప్రవేశించుచున్నారు]

కంచు—(రాజును జూచి) ఓహో! కొన్నిరూపములు సర్వావస్థలయందును రమణీయముగానే యుండును. ఈ విధముగాఁ జింతాకులుఁడయి యున్నను రాజు ప్రియదర్శనుఁడుగా నున్నాఁడు! అవును.

సీ. మఱివిశేషంబుగ మండనసముదాయ
మేమియుఁదాల్పక, యెడమచేతఁ
జెలువంబుమీఱ ముంజేతికిఁ బంగారు
కడియంబుమాత్ర మొక్కటి ధరించి,
శ్వాసాతిశయమునఁ జాలంగ శోషిల్లి
యరుణిమదూలినయధర మొప్ప,
సరిలేనిచింతల జాగరణంబులఁ
గడు నెఱ్ఱనైనట్టి కనులు గలిగి,
చిక్కియుండియు నౌర ! యీ క్షితివరుండు
తనదు మహనీయతేజోవితానమునను
సానఁబట్టినరత్నంబు చందమునను
దనకృశత్వంబు తోఁపక తనరు నిపుడు.

సాను—(రాజును జూచి) నిరాకరించుటచేత నవమానింపఁ బడియు శకుంతల యీతని నిమిత్తము కృశించుచుండుట యుక్తము గానే యున్నది.

రాజు—(ఆలోచించుచు మెల్లఁగా నడచి)

గీ. మిగుల హరిణాక్షి చే మున్ను మేలుకొలుపఁ
బడియు, నిద్రించుచుండె నీపాడుమనసు;
ఘనదురంతపశ్చాత్తాప మనుభవించు
కొఱకు మేల్కొనియున్నది కోరి యిపుడు.

సాను—మా శకుంతలభాగ్యములు నిటువంటివే సుమా !

విదూ—(చే యడ్డము పెట్టుకొని) ఇతఁడు మరల శకుంతలా వ్యాధిచేతఁ బీడింపఁబడుచున్నాఁడు; ఇది యెట్లు కుదురుపాటునకు రాఁగలదో నాకుఁ దెలియకున్నది.

కంచు—(దగ్గఱకు వెళ్ళి) దేవా ! జయ మగుఁ గాక ! జయ మగుఁ గాక ! ఓమహారాజా ! ప్రమదవనభూములను బరిశీలించి

నాఁడను, దేవరవారు యథేష్టముగా వినోదస్థలములయందు విహారింపవచ్చును.

రాజు—వేత్రవతీ! తడవుగ మేలుకొని యుండుటచేత మే మిప్పుడు ధర్మాసనము నధిష్ఠించుటకు శక్తులము గాకున్నాము. అతఁడు విచారించిన పౌరకార్యములను బత్రికయందు వ్రాసి పంపు మని మంత్రియైనపిశునునితో నావచనములుగాఁ జెప్పుము.

ప్రతీహారి—దేవర యాజ్ఞాపించునట్లు చేసెదను.

(అని నిష్క్రమించెను.)

రాజు—వాతాయనా! నీవును నీ పనియందుఁ జక్కఁగా వర్తిల్లుము.

కంచు—దేవర యాజ్ఞాప్రకారము చేసెదను.

(అని నిష్క్రమించెను.)

విదూ—మీ రిప్పు డీఁగయు నిచట లేకుండఁ జేసితిరి. ఇఁక నెండలేక చల్లనై యుండుటచే మనోహర మయియున్న యీయుద్యానవనభూమియందు మీరు హాయిగాఁ గ్రీడింపవచ్చును.

రాజు—మిత్రుఁడా! సందు దొరకినప్పు డాపదలు చెంతనే యుండు నన్నవాక్య మసత్యముకాదు.

గీ. ఋషికుమారికాప్రణయంబు స్మృతికిఁ దగుల
నీని తమము నాహృదయంబు నిపుడు విడిచె;
గావున, మరుండు ప్రహరింపఁగాఁ దలంచి
వింటను రసాలశర మెక్కు వెట్టె సఖుఁడ!

విదూ—మీరు కొంచె మూరకుండుఁడు. నే నీ దండకాష్ఠముతో మన్మథబాణమును నాశనము చేసెదను. (అని దండకాష్ఠము నెత్తి మామిడిచిగురును పడఁగొట్టఁబోవుచున్నాఁడు)

రాజు—(చిఱునవ్వుతో) మేలు! నీబ్రహ్మతేజస్సు కనంబడినది సఖా! ఎక్కడం గూరుచుండి ప్రియురాలిని గొంచెము పోలియున్న తీంగెలయందు దృష్టి పఱపుదును!

విదూ—"మాధవీమండపమునం దీవేళం గడపెదను. అందు జిత్రఫలకమున స్వహస్తముతో లిఖించిన పూజ్యురాలయిన శకుంతల రూపమును నాకుం దెమ్ము" అని యిక్కడనున్న చతురికయను పరిచారికను మీరు పంపలేదా?

రాజు—నాహృదయమునకు వేడుకగలిగెడు చోటటువంటిదే. కాంబట్టి నీవే త్రోవ చూపుము.

విదూ—దేవా! ఇటు. ఇటు.

(అన యిద్దఱును నడుచు చున్నారు)

సాను—(వారివెంటనే వెళ్ళుచున్నది)

విదూ—ఇదిగో మణిశిలాఫలకముతోంగూడిన మాధవీలతా మండపము. పూలు మొదలయినకానుకలచే మనోహర మయి స్వాగతముచేసి మనలకయి యెదురు చూచుచున్నట్లున్నది. కాంబట్టి యందుం బ్రవేశించి కూరుచుందము.

(అని యిద్దఱును నడుచు చున్నారు.)

సాను—ఇప్పుడీతీవెచాటుననుండి సఖరొక్క చిత్రరూపమును జూచి, తరువాత భర్త యొక్క బహువిధములైన యనురాగవిశేషములను నే నామెకు నివేదించెదను. (అని యట్లుచేసి నిలుచున్నది.)

రాజు—మిత్రుండా! ఇప్పుడు శకుంతల ప్రథమవృత్తాంతమంతయు స్మరణకు వచ్చినది. ఇది నీకు మునుపే చెప్పితిని. ఆమెను బంపివేసినప్పుడు నీవును నాయొద్ద లేకపోతివి; అంతకుముందును నీ వొకప్పుడును నాతో నామె పేరైనను ముచ్చటింపకపోతివి. నావలెనే నీవుకూడ మఱచిపోయినావా?

విదూ—నేను మఱచిపోలేదు. అయినను నీ వంతయుఁ జెప్పి కడపట నిది పరిహాసోక్తి కాని నిజము కాదంటివి. మంత్తిముద్దవంటి బుద్ధి కలవాఁడ నగుటచే నేనట్లే గ్రహించితిని. ఇంతకును గావలసినది కాక మానదు.

సాను—ఇది నిజమే.

రాజు—(ధ్యానించి) మిత్రుఁడా నన్ను రక్షింపుము.

విదూ—ఓయీ! ఏమది? ఈ విధముగా నగుట నీకుఁ దగదు కదా! గొప్పవారెప్పుడును మనసున శోకమునకుఁ జోటియ్యరు. పెనుగాలికి సహితము పర్వతములు చలింపవు.

రాజు— మిత్రుఁడా! నిరాకరణదుఃఖవివశయైన ప్రియురాలి యప్పటియవస్థ దలఁచుకొని నేను మిక్కిలి దిక్కుమాలినవాఁడ నైనాఁడను.

ఉ. ఏను నిరాకరింప నపుడే స్వజనంబులవెంటఁ బోవఁ బోఁ
గా, నిలుమంచు గట్టిగను గణ్వసమానుఁ డదల్ప శిష్యుఁ డా
చాన నిగిడ్చ బాష్పకలుషంబగు దృష్టిని గ్రూరనైన నా
పై, నది నన్నుఁ బెన్విషపుబాణము కైవడి నిర్దహించెడుఁన్.

సాను—ఆహాహా! స్వకార్యపరత్వ మిట్టిదేకదా! ఈతని సంతాపముచేతనే నేను సంతోషము బొందుచున్నాను.

విదూ—ఓయీ! ఆమె నాకాశచరు లెవ్వరో యెత్తుకొనిపోయి యుందురని నాకొక్కయూహ కలదు.

రాజు—అన్యు లెవ్వరు పతివ్రతను బరామర్శించుట కుత్సహింతురు? మేనకకదా యామెకుఁ దల్లియని విన్నాను. అందుచేత నామెసహచారిణులు ప్రియురాలి నపహరించిరని నా హృదయము శంకించుచున్నది.

సాను—తెలియకపోవుట యాశ్చర్యపడఁదగినది గాని తెలియుట కాదు.

విదూ—అట్లయిన శీఘ్రకాలములోనే నీకామెతోడి సమాగమము కలుగును గదా?

రాజు—ఏలాగున?

విదూ—తల్లిదండ్రులు భర్తృవియోగదుఃఖితయైన కొమార్తెను జూచి సహింపఁజాలరు.

రాజు—మిత్రుఁడా!

గీ. స్వప్నమో మాయయో మతిభ్రమమొ యద్ది;
యంతటిఫలంబె యిచ్చి పుణ్యము నశించె;
దరుణి క్రమ్మఱ వచ్చుట దాఁటిపోయె;
పాతెడు మనోరథఝరంబు పార మెడలి.

విదూ—అట్లు కాదు. అవశ్యముగా రాఁదగినవస్తువుయొక్క సమాగమము తప్పక కలుగుననుట కీయుంగరమే నిదర్శనముగా నున్నది.

రాజు—(ఉంగరమును జూచి) ఇది దుర్లభస్థానమునుండి జాఱి శోచనీయముగా నున్నది.

గీ. ఉంగరమ! నీసుసుకృతంబు నొకట నాకు
వలెనె యల్పమంచూహింతు ఫలముచేత.
నరుణనఖ మనోహరములౌ యామె వ్రేళ్ళఁ
జేరఁ గాంచియు భ్రష్టతఁ జెందుకతన.

సాను—ఇది మతియొక్కనిచేతఁ బడినయెడల నిజముగానే శోచనీయ మగును.

విదూ—ఓయీ! ఈ యుంగరము నేయుద్దేశముతో నీ వామె చేతిని బెట్టితివి?

సాను—నాకును నీతని నిది యడుగుటకుఁ గౌతూహలము కలదు.

రాజు——వినుము. అప్పుడు స్వపురమునకుఁ బ్రయాణ మయిన నాతోఁ బ్రియురాలు కన్నులనీరు పెట్టుకొని "ఎంతకాలమునకుఁ బ్రాణేశ్వరుఁడు నన్ను రప్పించుకొందురు ?" అని పలికెను.

విదూ——అటుతరువాత ?

రాజు——తరువాత నే నీ యుంగరము నామె వ్రేలికిఁ దొడుగుచు నిట్లు ప్రత్యుత్తర మిచ్చితిని.

చ. దినదిన మొక్కటొక్కటిగ దీనిపయిందగు నాదుపేరిటం
దనరెడి యక్షరంబులను దప్పక యెన్నుట కెన్ని నాళ్ళుప
ట్టునో విను మన్నినాళ్ళకుఁ, గుటుంబినిరో ! యిట నీకుచెంతకుం
జనులను బంపువాఁడను వెస న్నిను నంతిపురంబు చేర్చఁగన్.

అని, యీమాటను సహితము క్రూరస్వభావుఁడ నైన నేను మోహము చేత మఱచిపోతిని.

సాను——ఈ గడువు రమణీయముగా నున్నది! ఇది విధిచేత వ్యత్యస్తముగాఁ జేయఁబడినది.

విదూ——ఇది యెట్లు జాలరివాఁడు తఱిగిన యెఱ్ఱచేఁప కడుపు లోనికి వెళ్ళినది ?

రాజు——శచీతీర్థమునకు నమస్కరించుచుండినప్పుడా చెలి చేతి నుండి జాఱి గంగాప్రవాహమునఁ బడినది.

విదూ——సరిసరి.

సాను——అందుచేతనే పాపమునకు భయపడి యీ రాజేంద్రునకు దీనురా లయిన శకుంతలయెడ వివాహవిషయమయి సందేహము కలిగెను. మఱియు నిటువంటి యనురాగము గలవాని కానవా లెందునిమిత్తము కావలసివచ్చెనో !

రాజు——ఇప్పు డీయుంగరమును నిందించెదను.

విదూ——(తనలో) ఈతఁడు వెఱ్ఱిపోవను బడుచున్నాఁడు. (ప్రకాశముగా) ఈ దండకాష్ఠమును నేనును నిందించెదను.

రాజు——ఎందుకొఱకు ?

విదూ——నీ వెందుకొఱకు?

రాజు——(ఉంగరమును జూచి)

గీ. అకట ! మృదుబంధురాంగుళి యగు కరంబు
విడిచి యేటికి జలములోఁ బడితివీవు ?
జడమ వగుటను గుణ మెంచఁజాల, వైన
బ్రియను నేనేటికిఁ దిరస్కరించినాఁడ ?

విదూ——(తనలో) ఆహా ! నన్నాకలి మ్రింగివేయుచున్నదిగదా?

రాజు——అకారణముగా విడిచిపెట్టఁబడిన యో ప్రియురాలా ! పశ్చాత్తాపసంతప్త హృదయుఁడైన యీజనుఁడు పునర్దర్శనముచేతననుగ్రహింపఁబడఁ దగినవాఁడు సుమా.

[చిత్రఫలకమును చేతఁబట్టుకొని చతురిక వేగముగాఁ
ప్రవేశించుచున్నది]

చతు——దేవా ! ఇదిగో చిత్రఫలకము.

(అని చిత్తరువు పలకను జూపుచున్నది)

విదూ——మేలు ! మిత్రుఁడా ! మేలు ! ఈ స్వభావానులేఖనము రమణీయస్థితిచేత దర్శనీయముగా నున్నది. నిమ్నోన్నతప్రదేశములందు నాదృష్టి జాఱుచు లేచుచున్నట్టున్నది.

సాను——ఆహా ! ఏమి యీ రాజునేర్పు ! సఖి నాముందరనున్నట్టే తోఁచుచున్నది.

రాజు——క. ఏయది యింపుగ నుండదొ
యాయది చిత్రమునఁ దోఁచు నతిరమ్యముగా
నే; యటు లయ్యును, సుందరి
సోయగ మిటఁ దక్కనగనె చూపట్టఁజుమీ.

సాను—పశ్చాత్తాపమువలనఁ గలిగిన యధిక ప్రేమమునకును గర్వరాహిత్యమునకును నీమాట తగియున్నది.

విదూ—ఓయీ! ఇందు ముగ్గురుముద్దియలు కనఁబడుచున్నారు. అందఱును సుందరులుగానే యున్నారు. వీరిలోఁ బూజ్యురాలయిన శకుంతల యెవరో?

సాను—ఇటువంటి రూపమునుగూడఁ దెలిసికోలేని యీతనిదృష్టి నిరర్థకముకదా!

రాజు—ఇందామె యెవ్వరని నీవూహించెదవు?

విదూ—ఇదిగో విడిపోయిన ముడినుండి పూలు జాఱెడు కొప్పుతోను జెమ్మటపట్టిన మొగముతోను మిక్కిలి చాఁచినచేతుల తోను నీళ్ళుపోయుటచే మృదువైన క్రొంజిగుళ్ళుగల మామిడిచెట్టు యొక్క పార్శ్వమునందుఁ గొంచె మలసియున్నట్టుగా లిఖింపఁబడిన యీమె శకుంతల యనియుఁ దక్కినవారు చెలికత్తె లనియు నూహించెదను.

రాజు—నీవు నిపుణుఁడవు. నా సాత్త్వికాభావచిహ్నము లిక్కడను నున్నవి.

గీ. చెమటపట్టినవ్రేళ్ళంటి చెడి యొకింత
మలిన మయి కానఁబడెడు రేఖలకుఁబొంత;
బాష్పకణములు చెక్కులపయినిఁ బడుచు
నిదిగో కన్పట్టెడును వర్ణమిచట నుబికి.

చతురికా! ఈ వినోదస్థానము సగమే వ్రాసితివి. కాఁబట్టి యిప్పుడు నీవు వెళ్ళి తూలికను దీసికొని రమ్ము.

చతు—అయ్యా! మాధవ్యా! ఈచిత్రపుఁబలకను బట్టుకొమ్ము. నే నిప్పుడు మరల వచ్చెదను.

రాజు—ఇది నేనే పట్టుకొనెదను. (అని చెప్పినట్టు చేయఁగాఁ జతురిక వెళ్ళెను.)

రాజు—గీ. కమలయెదుర మున్ గనఁబడ్డ కాంతవిడిచి
వేమఱును జిత్రగత గారవించు నేను,
నడిమిదారిని జలపూర్ణనదిని వదలి
వచ్చి యెండమావులఁ గోరువాఁడ నైతి.

విదూ—(తనలో) ఈయన నిజముగా నేఱుదాఁటి వచ్చి యెండ మావులలోనే తగులుకొన్నాఁడు. (ప్రకాశముగా) మిత్రుఁడా! ఇక్కడ నింకను వ్రాయవలసినది మఱియేమున్నది?

సాను—సందేహము లేదు. నా చెలి కేయేప్రదేశములు మనోహరములో వాని వానిని వ్రాయఁదలఁచి యున్నాఁడు.

రాజు—మాధవ్యా! వినుము.

చ. పులినములందు హంసయుగము ల్విహరించెడు మాలినీనదిన్,
బలుహరిణంబులున్న తదుపాంత పవిత్ర హిమాద్రిపాదమున్,
వలువలుగట్టు శాఖలను వ్రేలు వృక్షముక్రింద నిల్చి కొ
మ్ముల్దనకన్ను గోఁకికొను ముగ్ధమృగిన్, లిఖియింపఁగోరెదన్.

విదూ—(తనలో) ఈచిత్రఫలకము వ్రేలుగడ్డములుగల తాపస బృందములతో నింపఁదగు నని నేను భావించెదను.

రాజు—మిత్రుఁడా! మఱియు నే నుద్దేశించిన శకుంతలాభరణము నొకదానిని నే నిందు మఱచిపోతిని.

విదూ—అది యేది?

సాను—వనవాసుల శరీరసౌకుమార్యమునకుఁ దగిన దేదో యయియుండును.

రాజు—గీ. కేసరములు చెక్కులదాఁకఁ గ్రిందవ్రేలఁ
జేర్పనైతి శిరీషంబు చెలువ చెవిని;
స్తనములకుమధ్య శారదచంద్రకిరణ
కోమలమృణాలసూత్రంబుఁ గూర్పనైతి.

విదూ—ఓయీ! ఈమె యొందుచేతనో యెఱ్ఱకలువతేకుల కాంతిచే నొప్పు హస్తాగ్రములో మొగముమాటుకొని బెదరిబెదరి యున్నట్లున్నది. (సావధానముగా విమర్శించి చూచి) ఆహా! జానిసె కొడుకు పూఁదేనెలదొంగయైన యాగండుతుమ్మెద యీమె మొగము మీఁదికి గంతు వేయుచున్నది.

రాజు—ఓయీ! ఈ దుష్టుని నివారింపుము.

విదూ—అవినీతులను శిక్షించు నీవే దీనిని వారించుటకు శక్తుఁడవు.

రాజు—సరే; ఓయీ! పుష్పలతాప్రియాతిథీ! ఇక్కడ వాలుచు నేల శ్రమ ననుభవించెదవు?

గీ. దగనొనియు నీకు ననురక్తయగుచు నిదిగొ
పుష్పముల నిల్చి మధుకరి పూవుఁదేనె
నీవు లేకుండఁగను దాను ద్రాఁవ లేక
యెదురుచూచెడు నీకొఱ కిప్పు డకట!

సాను—ఇప్పు డది చక్కఁగా వారింపఁబడినది.

విదూ—ఈజాతి వారింపఁబడినను వక్రస్వభావముగలది.

రాజు—ఓయీ! ఈవిధమున నీవు నాశాసనమున నిలువకున్నావు. కాఁబట్టి యిప్పుడు వినుము—

చ. వరతరునూత్నపల్లవవిభారమణీయము నొచు, నేను బల్
గరుణమెయిఙ్ రతోత్సవములఙ్ మఱి పానమొనర్పనొప్పు సుం
దరియధరోష్ఠబింబమును దాఁకెదవేనియు నిన్నుఁ బట్టి, బం
భర! కమలోదరంబునను బంధన మేనొనరించెదం జుమీ.

విదూ—ఇటువంటి కఠినదండనమునక దేల భయపడకుండును! (నవ్వి తనలో) ఈతఁడిప్పుడు వెఱ్ఱివాఁడయి పోయినాఁడు. ఈతని సాంగత్యముచేత నేనును నిట్టివాఁడనేనైతిని. (ప్రకాశముగా) ఓయీ! ఇది చిత్తరువుగదా?

రాజు—చిత్రము వేమి!

సాను—ఇప్పుడు నేనుసహితము నిజము తెలిసికోలేకపోతిని. వ్రాఁతలోనున్నట్టుగానే భావించుకొనెడి యీతని విషయమయి చెప్ప వలసిన దేమున్నది?

రాజు—మిత్రుఁడా! ఇప్పుడీ దోషైకదర్శిత్వ మెందుచేత?

గీ. తన్మయము చేసి హృదయంబుఁ దథ్యముగను
దర్శనసుఖంబు పొందుచుఁ దనరు నాకు
స్మరణకును దెచ్చి, యయ్యయో! మరల నిపుడు
చెలువ నొనరించితివి నీవు చిత్రరువుగ.

(అని బాష్పములు విడుచుచున్నాఁడు.)

సాను—ఆహా! ఆద్యంతములు లేక యీ విరహమార్గ మపూర్వముగా నున్నది.

రాజు—మిత్రుఁడా! విరామము లేని యీ దుఃఖము నే నెట్లనుభవింపుమను.

క. వనితను గలలోఁ గల సెద
ననుకొన్నను, జాగరముల నదియున్ జెడియెఁ;
ఘనబాష్పంబులు కాంతను
గనుఁగొనఁగా నీవు చిత్రగత నైనఁ గటా!

సాను—శకుంతలయొక్క యవమానదుఃఖమును నీవు సర్వవిధములచేతను బోఁగొట్టినాఁడవు.

చతు—(ప్రవేశించి) దేవా! జయ మగుగాక! జయ మగుగాక! రంగులపెట్టెను బట్టుకొని యీ వైపునకు బయలుదేఱితిని.

రాజు—తెదనంతరము?

చతు—త్రోవలోఁ దరళికతో వచ్చుచున్న వసుమతీదేవి దీనిని నేనే భర్తగారికిఁ దీసికొనిపోయి యిచ్చెదనని నా చేతినుండి బలాత్కారముగా లాగుకొన్నది.

విదూ—అదృష్టవంతురాలవుగనుక నిన్ను విడిచిపెట్టినది.

చతు—కొమ్మకుఁదగులుకొన్న దేవిగారి యుత్తరీయమును దర లిక వదలించునంతలో నేను తప్పించుకొని వచ్చినదానను.

రాజు—మిత్రుఁడా! మన్ననచేత గర్వితురాలయియున్న దేవి వచ్చినది. నీవీ చిత్రరువును రక్షింపవలయును.

విదూ—'న' న్ననిచెప్పుము. (చిత్రఫలకమును బట్టుకొనిలేచి) నీ వీ యంతఃపుర కాలకూటమునుండి విముక్తుఁడవయిన పక్షమున, మేఘ ప్రతిచ్ఛంద మను మేడమీఁద నుండెద, నన్ను గేక వేయుము.

(అని వేగముగా నిష్క్రమించెను.)

సాను—హృదయము వేఱొకరిమీఁదఁ గలిగియున్నను బూర్వ గౌరవమును నిలిపియున్నాఁడు. కావున నితని సౌహృదము స్థిరమయి నదిగా నున్నది.

ప్రతీ—(లేఖ చేతఁబట్టుకొని ప్రవేశించి) దేవా! జయమగుఁ గాక! జయమగుఁగాక!

రాజు—వేత్రవతీ! నీవు త్రోవలో దేవిని జూడలేదుగదా?

ప్రతీ—నాచేఁత లేఖను జూచి దేవి వెనుకకు మరలినది.

రాజు—కార్యజ్ఞురాలు గనుక నా కార్యమునకుఁ బ్రతిబంధము కలుగనియ్యదు.

ప్రతీ—దేవా! "ధనసంచయము లెక్క పెట్టుటకుఁ జాలసేపు పట్టినందున నేఁడు పౌరజనకార్య మొక్కటిమాత్రమే యిప్పుడు విచారింపబడినది. ఈ పత్రికయందు లిఖింపబడిన యీ వ్యవహారమును దేవరవారు చిత్తగింతురుగాక!" అని మంత్రి విన్నవించుచున్నాఁడు.

రాజు—పత్రిక యీలాగునఁ గనఁబఱుపుము.

ప్రతీ—(చేతికిచ్చును.)

రాజు—(చదివి) ఏమీ! సముద్రవ్యవహారియైన ధనమిత్రుడను వణిజుఁడు సంతానహీనుఁడును, దీనుఁడు నయి యోడమునీఁగి మృతినొందినాఁడు. గనుక వాని సొత్తంతయు రాజును జేరవలయునని మంత్రి వ్రాసియున్నాఁడు. అక్కటా! అనపత్యతకష్టముగదా! బహుధనసంపన్నుఁడగుటవలన నతనికి బహుభార్యలుండి యుండవచ్చును. ఆతనిభార్యలలో నెవ్వతెయైన గర్భిణియై యున్నదేమోఁ విచారింపఁవలయును.

ప్రతీ—ఆతని భార్య సాకేతసెట్టి కూఁతునకుఁ బుంసవనము జరిగిన దని యిప్పుడే వినియున్నాను.

రాజు—గర్భస్థశిశువును దండ్రి ధనమున కర్హుఁడైనదే. పోయి నీ విది మంత్రితోఁ జెప్పుము.

ప్రతీ—దేవరవారిసెలవు ప్రకారము చేసెదను. (అని బయలుదేఱును.)

రాజు—వేత్రవతీ! ఇటురమ్ము.

ప్రతీ—ఇదిగో వచ్చితిని.

రాజు—సంతతి యున్నది లేదనెడి యీ విచార మెందుకు!

గీ. ప్రజ లెవరి నెవ్వరిని ప్రాణబంధువులను
 దారు పోఁగొట్టుకొందురో వారి కెల్ల
 దురితమునఁ దక్క దుష్యంతధరణివిభుఁడె
 సర్వమున కంచు, నెల్లెడఁ జాటవలయు.

ప్రతీ—ఈ విధమున జాటింపవలసినదే. (వెడలిపోయివచ్చి మరల ప్రవేశించి) కాలమునఁ గురిసిన వర్షమువలె దేవరవారియాజ్ఞ నందఱును గొనియాడిరి.

రాజు—(వేడినిట్టూర్పువిడిచి) ప్రతీహారీ! సంతానాభావముచేత నిరాధారములైన వంశములలో మూలపురుషుల యనంతరము

సంపదలీవిధమున నే పరులపాలగునుగదా ! నా యనంతరము పూరువంశ సంపద లకాలమున విత్తనములు చల్లిన భూమివలెనే కాఁగలవు.

ప్రతీ—అట్టి యమంగళము కలుగకుండునుగాక !

రాజు—ఛీ ! నేను సమాసన్నమయిన శ్రేయస్సునే యవమానించినాఁడను.

సాను—ఇతఁడు నిస్సంశయముగా మనస్సుచేత జెలి నుద్దేశించియే యీ విధముగాఁ దన్ను నిందించుకొనుచున్నాఁడు.

రాజు—

గీ. స్థిరతఁ దనయందు వంశప్రతిష్ఠ గన్న
ధర్మపత్నిని విడిచితిఁ దగవు మాలి
కాలమున విత్తనంబులఁగలయఁ జల్లి
మంచివేళ భూమిద్యజించినట్లు.

సాను—నీ సంతతి యింక నవిచ్ఛిన్నము కాఁగలదు.

చతు—(ప్రతీహారితో నేకాంతముగా) వేత్రవతీ ! ఈ వర్తకుని వృత్తాంతముచేత రాజు మిక్కిలి మతి కలఁగి భయపడుచున్నాఁడు. ఈయన నూఱడించుటకు మేఘప్రతిచ్ఛందమునుండి పూజ్యుఁడైన మాఢవ్యునిఁ దీసికొనిరమ్ము.

ప్రతీ—మంచిమాట చెప్పితివి. (అని నిష్క్రమించెను.)

రాజు—ఆహా ! దుష్యంతుని పితృదేవతలు సంశయదశ నొంది యున్నారు.

ఉ. అక్కట ! నాయనంతరమునందు యథావిధిగాఁగఁ దర్పణం
బెక్కులమందు నిచ్చునతఁ డెవ్వఁ డటంచును సంతు లేమిచేఁ
బొక్కుచునింక నే విడువఁబోయెడునశ్రులలోనఁ దుద్వఁగాఁ
జిక్కననీరు త్రాగుదురు చేడ్పడి మాపితరుల్ నిజంబుగన్.

(అని మూర్ఛపోవుచున్నాఁడు.)

చతు—(తొట్రుపాటుతో చూచి) స్వామీ ! ఊఱట చెందుఁడు.

సాను—కటకటా! ఈతఁడు దీపమును గలిగియుండియు, దెరమఱుఁగుగానున్న దోషముచేతఁ జీకటి ననుభవించుచున్నాఁడు, నేనిప్పుడే యీతనిని సుఖునిగాఁ జేసెదను, అట్లుకాదు. యజ్ఞభాగముల కొఱ కాసక్తు లయియున్న దేవతలే శీఘ్రకాలములో నీభర్త నిన్ను ధర్మపత్నినిగాఁ జేసికొనునట్లుచేయఁగలరని యింద్రునితల్లియే శకుంతల నూరడించుచుండఁగా నేను విన్నాను. కాబట్టి, యంతకాలమునఱకును గనిపెట్టుకొని యుండఁదగును. ఈ యావద్వృత్తాంతముచేత నాప్రియసఖి నూఱడించెదను. (అని ఆకాశమార్గమున నిష్క్రమించుచున్నది.)

[తెరమఱుఁగున – చచ్చితి రక్షింపుము. రక్షింపుము.]

రాజు—(తెలివితెచ్చుకొనియాలకించి) అయ్యో! మాఢవ్యుని యార్తనాదమువలెనున్నది. ఓరీ! ఎవరెవ రక్కడ?

ప్రతీ—(ప్రవేశించి) దేవా! ప్రాణసంశయము నొందియున్న నీ మిత్రునిఁ గాపాడుము.

రాజు—ఆ పిన్నవాని నెవఁడు బాధించుచున్నాఁడు?

ప్రతీ—కంటి కగపడకుండ నేదో భూతమెత్తుకొని పోయి యాతనిని మేఘప్రతిచ్ఛందమను మేడయొక్క కొట్టుకొనను బెట్టినది.

రాజు—(లేచి) అట్లిన్నటికినిజరుగదు. భూతములు మా గృహములనుం దిరస్కరించునా? అట్లుకాదు.

గీ. దినముదినము నొక్కటఁ బ్రమాదజనితదోష
ములను నావె నేఁ దిన్నఁగఁ దెలియఁజాల;
నింకఁ బ్రజలలోపల నెవ్వఁ డేవిధమున
మెలఁగునో పూర్ణముగ నెట్లు తెలియవచ్చు?

(తెరయందు)— ఓ మిత్రుఁడా! అయ్యో! అయో!

రాజు—(గతిభేదముచేసడచి) చెలికాడా! భయపడకు. భయపడకు.

(తెరలో)—అయ్యో! అయ్యో! ఎట్లు భయపడకుందును! వీఁడెవ్వఁడో నన్ను మెడ వెనుకకువంచి చెఱకువలె గట్టిగా విఱుచుచున్నాఁడు.

రాజు—(చూపునిగిడించి) ధనస్సు ధనస్సు.

యవని—(విల్లు చేతఁబట్టుకొని ప్రవేశించి) దేవా! ఇదిగో హస్తత్రాణసహితముగా ధనస్సు.

రాజు—(బాణసహితముగా విల్లు పుచ్చుకొనుచున్నాఁడు.)

(తెరయందు)—

గీ. గొంతుక్రోవిక్రొన్నెత్తురు గ్రోలఁగోరు
నేను బశువును బులియట్ల నిను వధింతు;
నార్తులభయంబు నుడుప బాణాసనంబు
పూనుదుష్యంతుఁ డిపుడు నిన్ గ్రోచుఁగాక!

రాజు—(రోషముతో) ఏమీ! నన్నే పేర్కొనుచున్నాఁడు! ఓపీనుఁగులదిండీ! నిలువు; ఇప్పుడే నీ పనియగును. (విల్లెక్కుపెట్టి) వేత్రవతీ! సోపానమార్గము చూపు.

ప్రతీ—దేవా! ఈలాగు ఈలాగు. (అందఱును త్వరగా నడుచుచున్నారు.)

రాజు—(అంతటనుజూచి) ఇక్కడ నేమియు లేదే?

(తెరమఱుఁగున)—అయ్యో! రక్షింపుము. నేనిక్కడ నిన్నుఁ జూచుచున్నాను. నీవు నన్నుఁ జూడకున్నావు. పిల్లిపట్టిన యెలుకవలె బ్రతుకునందు నిరాశయుఁడనై యున్నాను.

రాజు—ఓరీ! తిరస్కరిణీవిద్యచేత గర్వితుఁడవై యున్నావు. నా యస్త్రము నిన్నుఁ జూడఁగలదు. ఇదిగో బాణమును సంధించుచున్నాఁడను.

గీ. హంస క్షీరపానము చేసి యందులోన
చేరియున్న జలంబు వర్జించునట్లు
వధ్యుఁడవగు నిన్ వధియించి బాణ మిదియు
రక్షణము చేయు రక్ష్యుడౌ బ్రాహ్మణేంద్రు.

(అని బాణము సంధించుచున్నాఁడు.)

[అప్పుడు విదూషకుని విడిచి మాతలి ప్రవేశించుచున్నాఁడు]

మాత—ఉ. ఇంద్రుఁడు నీశరాలికి సురేంద్రుల లక్ష్యులఁ జేసె, గాన, రా
జేంద్ర! భవచ్ఛరాసనము నెక్కిడు మిప్పుడు వారిమీఁద ని
స్తంద్రత; మిత్రవర్గము పెసం దగుఁగాక భవత్ప్రసన్న తా
సాంద్రకటాక్ష పాతములు, శాతశరం బరివోవఁ జెల్లునే?

రాజు—(అస్త్రముపసంహరించి) ఓయీ! మాతలీ! ఇంద్రరథికి స్వాగతము.

విదూ—(ప్రవేశించి) నన్ను యజ్ఞపశువును జంపినట్లు చంపిన వానినే యితఁడు స్వాగత మడిగి గౌరవించుచున్నాఁడు!

మాత—(చిఱునవ్వుతో) ఆయుష్మంతుఁడా! నీ సన్నిధికి నన్ను దేవేంద్రుఁడు పంపినపని వినుము.

రాజు—సావధానచిత్తుఁడ నయి యున్నాను.

మాత—కాలనేమిసంతతియైన దుర్జయమను రాక్షసగణము కలదు.

రాజు—కలదు; నే నీవఱకే నారదునివలన విని యున్నాను.

మాత—ఉ. నీ చెలియైనయింద్రునకు నిక్క మజయ్యులు వారు; వారలన్
బీఁచ మడంతు వీవు రణమేదినినంచును వాసవుండు సం
కోచము లేక నమ్మె; రవి కూల్పఁగ రేనితమంబు నిర్విలో
నేచి నిశాకరుండు నశియింపఁగఁ జేయుఁడె రాత్రివేళలన్.

కాఁబట్టి నీ వాయుధమును ధరించి యిప్పుడే యీ యింద్రరథము నెక్కి శత్రుజయమున కయి బయలుదేఱుము.

రాజు—నే నీ యింద్రునిగౌరవముచేత ధన్యుఁడ నయినాఁడను. మఱి మీరు మాఢవ్యునివిషయమున నట్లేల చేసితిరి ?

మాత—అదియుఁ జెప్పెదను. నీ వేకారణమువలననో మనస్తాపముచేత వివశుఁడ వయి యుండుట చూచి నీకుఁ గోపము తెప్పించుటకై యట్లు చేసితిని. ఎట్లన—

గీ. చితుకులు కదల్చుటను నగ్ని చెలఁగి మండు;
చెడుగుఁ జేయుటచేఁ బాము పడగ విప్పు,
మఱియు క్షోభంబువలననె మానవుఁడును
దనదు మహిమంబు చూపును దథ్యముగను.

రాజు—(ఏకాంతముగా) మిత్రుఁడా ! మాఢవ్యా ! ఇంద్రుని యాజ్ఞ యనతిక్రమణీయము గనుక నీవేగి యీ సంగతి మంత్రియైన పిశునునకుఁ జెప్పి నా వాక్యముగా నిట్లనుము—

గీ. నీమతి యొకటియె యింతకు
క్షేమముతోఁ బ్రజల నేల జెల్లును జుమ్మీ;
నామహితధను వధిజ్యం
బై మఱియొకపనికి నిదిగో వ్యాపృత మయ్యెన్.

విదూ—మీ రాజ్ఞాపించినట్లు చేసెద.

(అని నిష్క్రమించెను.)

మాత—ఆయుష్మంతా ! రథ మెక్కుము.

రాజు—మంచిది. (రథారోహణమునభినయించుచున్నాఁడు.)

(అందఱును నిష్క్రమించుచున్నారు)

సప్తమాంకము

[అప్పు డాకాశయానమున రథారూఢుఁడయిన రాజును
మాతలియుఁ బ్రవేశించుచున్నారు.]

రాజు—ఆజ్ఞను నిర్వహించినవాఁడ నయినను, నే నింద్రుని సత్కారవిశేషమును బట్టి నన్ననుపయుక్తునివలె భావించుకొను చున్నాను.

మాతలి—(చిఱునవ్వుతో) ఆయుష్మంతుఁడా! మీ రిరువురును సంతుష్టులు కాలేదు; ఎట్లన—

గీ. ఇంద్రుఁ డొనరించుసత్కార మెంచి నీవు
సలుపు నుపకృతి లఘువుగఁ దలఁచె దీవు;
వజ్రియును నీమగంటిమివలనఁ బొంగి
తనదుసత్కారమును నెంచుఁ దక్కువగను.

రాజు—మాతలీ! అట్లుకాదు. అతఁడు దేవతల సమక్షమున నర్ధాసనమునఁ గూరుచుండఁబెట్టుకొని నన్నుఁ బంపునప్పుడు చేసిన సత్కారము కోరికకు మించి యున్నదిగదా!

గీ. ప్రార్థనముచేయ మది నెంచి పజ్జ నిలుచు
నందను జయంతుఁ గని చిఱునవ్వు నవ్వి,
వజ్రి హరిచందన మలంది వక్షమందుఁ,
దాని నామెడ వైచె మందారమాల.

మాత—నీ వమరేంద్రునివలన నేదిపొంద నర్హుఁడవుకావు! చూడుము—

గీ. సౌఖ్యపరుఁడైన యింద్రునిస్వర్గమునకు
నసురకంటకోన్మూలన మయ్యె రెంట.—

నిపుడు భవదీయబాణసమృద్ధిచేతఁ,
దొల్లి నరసింహునఖరాగ్రవాఁడిగోళ్ళచేత.

రాజు—ఇక్కడ శతక్రతునిమహిమయేకదా స్తవనీయము?

ఉ. భృత్యజనుల్ మహత్తరసుకృత్యముల న్నెఱవేర్చిరేని, యా
కృత్యము లట్లొనర్చుట యధీశుల మన్ననపెంపునం జుమీ!
నిత్యము నగ్రభాగమున నిల్పి యనూరుని నట్లు సూర్యుఁడే
న్నత్యము చూపకుండిన, నణంపఁ గలండె యతండు చీఁకటిన్.

మాత—ఇది సరే; (కొంచెముదూరము పోయి) ఆయుష్మంతుఁడా! అదిగో స్వర్గపురికి వెనుక నడచుచున్న నీకీర్తిసౌభాగ్యమును జూడుము.

గీ. వేల్పుసుందరు లొక్కింత దాల్ప, మిగిలి
నట్టిరంగులఁ గల్పలతాంశుకముల
దేవతలు వీరె వ్రాయఁగీతికల నీదు
చరితె వ్రాయుచున్నా రర్థసంగతముగ.

రాజు—మాతలీ! రాక్షసులతో యుద్ధము చేయవలె నను నాత్రముచేత గతదిన మంతరిక్షమున కెక్కినప్పుడు స్వర్గమార్గమును దిన్నగాఁ జూడలేదు. మనమిప్పు డే వాయుపథమున నున్నాము?

మాత— గీ. ఏది గగనగంగను వహియించు, నేది
సప్తఋషిమండలంబుల సంచరించు,
మఱి యుపేంద్రవిక్రమని స్తమస్కమేది,
యట్టిపరివహానిలమార్గ మంద్రు దీని.

రాజు—మాతలీ! అందుచేతనేకదా యంతరింద్రియ బహిరింద్రియసహితముగా నాయంతరాత్మ ప్రసన్న మగుచున్నది. (రథచక్రములఁజూచి) మనము మేఘమార్గమునకు దిగుచున్నాము.

మాత—ఎట్లు తెలిసినది ?

రాజు—

మానిని. చాతకముల్ రథచక్రపుటాకులసందులఁ బర్వెడుచుండుటచే,
నీ తురగంబుల మేనదటిత్తుల యెక్కుడు కాంతులుగ్రమ్ముటచే,
నా తతతీరము లోఁగల మేఘచయంబుపయిన్ జనుచుండుట తే
రే తెలుపుంజుమితుంపురుగుంపుల నీ తడియైతగు నేములతోన్.

మాత—ఓ మహారాజా ! ఇంకొకక్షణమునకు మీరు మీయధికారభూమియందే వర్తింపఁగలరు.

రాజు—(క్రిందు చూచి) వేగముగా దిగుచుండుటవలన మనుష్యలోక మాశ్చర్యదర్శన మయి కనఁబడుచున్నది.

చ. అదె మహీ ప్రస్ఫుటాద్రిశిఖరావళినుండియు డిగ్గునట్ల యా;
మొదళులతోఁపఁ జెట్లుడిగె మున్నటులాకులలో నడంగుటల్;
నదులు తొఱంగె డాయుట జలంబు కనంబడనట్టిరూపముల్;
బదిగ నెవండొ భూమి నిటుప్రక్కకుఁ ద్రోసెడురీతి తోఁచెడున్.

మాత—చక్కఁగాఁ జూచితిరి. (సగౌరవముగా చూచి) ఆహా ! భూమి యత్యంతరమణీయముగా నున్నది !

రాజు—మాతలీ ! అదియేమి ? పూర్వాపరసముద్రములదాఁక వ్యాపించి బంగారునీరు పూసినట్లు మెఱయుచు సంధ్యాకాలమేఘసమూహమువలెఁ బరత్వము కనఁబడుచున్నది.

మాత—రాజా ! ఇది హేమకూటమను కింపురుషపర్వతము. తాపసులసిద్ధిక్షేత్ర మయిన దీనిని జూడుము.

గీ. బ్రహ్మపుత్రుఁ డైన మరీచివలనఁ బుట్టి
దేవదానవులకుఁ దండ్రియై వెలుంగు

కశ్యపప్రజాపతి దాను గరము నిష్ఠ
భార్యతోఁగూడ నిందుఁ దపంబు చేయు.

రాజు—(సాదరముగా) అట్లయిన శ్రేయములదాఁటిపోరాదు. అపూజ్యునకుఁ బ్రదక్షిణము చేసిపోవఁ గోరెదను.

మాత—మంచి సంకల్పము.

(అని దిగుట నభినయించుచున్నాఁడు)

రాజు—(విస్మయముతో)

గీ. చక్రనేములు శబ్దంబు సలుప విందుఁ;
గ్రమ్ముకొనుచుఁ బరాగంబు కానఁబడదు;
క్ష్మాతలముఁ దాఁకకుంటచే స్యందనంబు
దిగియుఁ దాఁ దోఁచుచున్నది దిగనియట్లు.

మాత—ఇంద్రునకును దేవరవారికిని గల విశేషమింతే.

రాజు—మాతలీ! మారీచాశ్రమ మిందెక్కడ?

మాత—(చేతితోఁ జూపుచు)

సీ. వల్మీకమున నర్థభాగంబువఱకును
మునిఁగిన దేహంబు మునువుచూపఁ
బాముల కుబుసముల్ పయిఁ బర్వియున్నట్టి
వక్షస్థలము చాల వన్నెమీఱ,
వలయంబులగు జీర్ణ వల్లికాతతిచేతఁ
గడునీడనొందెడు కంఠమమర,
మూఁపులదాఁకను వ్యాపించిన పులుంగు
గూళ్ళతోడిజడలగుంపు తనర
నీతపోధనసత్తముఁ డింపుమిగులు
స్థాణురీతిని గరము నిశ్చలత పూని

యర్కమండలమునకును నభిముఖముగ
నిలిచి యున్నాఁడు చూడు మీ నెలవునందు.

రాజు—దుష్కరతపశ్శాలివైన నీకు నమస్కరించెదను.

మాత—(పగ్గములు పట్టి రథము నిలిపి) ఓమహారాజా! ఇదె యదితి పెంచిన మందారవృక్షములుగల కాశ్యపాశ్రమమును బ్రవేశించినారము.

రాజు—స్వర్గమును మించిన దీ సిద్ధిస్థానము. ఇప్పు డమృతసరస్సునందు మునింగినవానివలె నయినాఁడను.

మాత—(రథము నిలిపి) దేవర దిగవచ్చును.

రాజు—(దిగి) మాతలీ! నీ విప్పు డేమిచేసెదవు?

మాత—రథము నేను నియమించినచోటనే యుండును. నేనును దిగియెదను. (అలాగునచేసి) దేవా! ఇటు (కొంచెమునడచి) పూజ్యులయిన ఋషుల తపోవనభూములను జూతము.

రాజు—ఓయీ! విస్మయములోఁ జూచుచున్నాను.

చ. అమరతరుప్రశస్తవనమం దసుధారణవృత్తి గాలిచే,
సుమహితకాంచనాంబుజరజోవిలసజ్జలమందు స్నానముల్,
దమిని మణిప్రదేశముల ధ్యానము, నచ్చరలొద్ద సంయమం,
బమరఁ దపఃఫలం బితరులందు నెడల్ దప మొప్పు వీరికిన్.

మాత—మహాత్ములకోరిక పయిపయిని బాఱుచుండునుగదా! (కొంచెము నడచి యాకాశమునఁ జూచి) ఓయీ! వృద్ధశాకల్యా! పూజ్యుఁ డయిన మారీచమహర్షి యేమిచేయుచున్నాఁడు? దాక్షాయణి తన్నుఁ బతివ్రతాధర్మము లడుగ మహర్షి పతీసహితయైన యామెకుఁ జెప్పుచున్నాఁ డనుచున్నావా!

రాజు—(ఆలకించి) ఓయీ! అట్లయిన మనము మరల సమయముకొఱకుఁ బ్రతీక్షింపవలయును.

మాత—(రాజునుచూచి) నేను వచ్చినదాఁక మీరీయశోక వృక్షమువెుదటఁ గూరుచుండవలయును. నేనింతలో నింద్రజనకునితో విన్నవించుటకు సమయము కనిపెట్టెదను.

రాజు—మీకుఁ దోఁచినట్లు చేయుఁడు

(అని నిలుచున్నాఁడు.)

మాత—ఓ రాజా! నేను పోయివచ్చెదను.

(అని నిష్క్రమించెను.)

రాజు—(శుభనిమిత్తము సూచించి)

గీ. కోరను మనోరథం బేను గొంచెమేని,
వ్యర్థముగ నోభుజంబ! నీవదరె దేల
మును నిరాకరించిన మేలె పూని యిపుడు
దుఃఖముగ మాఱుచున్నది దుస్సహముగ.

(తెరలో)—మాను. చండగమునుమాను. ఆహా! ఎట్లు తన స్వభావమును గనఁబఱచుచున్నాఁడు!

రాజు—(ఆలకించి) ఇది దుష్టత్వమునకుఁ జోటుకాదు. ఇందు నిషేధింపఁబడువాఁ డెవ్వ డయియుండును? (శబ్దమువచ్చినదిక్కు చూచి చిఱునవ్వుతోఁ) ఓహో! ఇద్దఱు తాపసస్త్రీలు వెంటరాఁగా నిందున్న యీ యబలాసత్త్వుఁడగు బాలుఁ డెవఁడో!

గీ. తల్లిచనుపాలు సగంబు త్రాగి కుడుచు
చున్న సింహాపుఁబిల్లను హు మ్మటంచుఁ
కేసరములు గట్టిగఁ బట్టి క్రీడకొఱకు
నొకట బలవంతముగ నీడ్చుచున్నవాఁడు.

[పైనిజెప్పినరీతి పనిచేయు బాలుఁడును తాపసపత్నులును
ప్రవేశించుచున్నారు.]

బాలు—ఓ సింగమా! ఆవులింపుము. నీ దంతములు లెక్క-పెట్టెదను.

ప్రథమ—ఓరి యవినీతుఁడా! మన బిడ్డలవంటి జంతువులను బట్టి బాధించుచున్నావేమిరా? ఔరా! నీసంరంభము వృద్ధి యగుచున్నది! ఋషిజనులు నీకు సర్వదమనుఁ డని పేరు పెట్టినందుకు నీ కిది తగియే యున్నది.

రాజు—ఇది యేమోకాని యీ బాలునియెడఁ గడుపుఁబుట్టిన బిడ్డయందువలె నామనస్సు ప్రేమార్ద్రి మగుచున్నది. సంతానము లేకపోవుటయే నాకీవాత్సల్యమును గలిగించుచున్నది. నిశ్చయము.

ద్వితీయ—నీ వీ సింహాపుఁబిల్లను విడిచిపెట్టనిపక్షమున, ఇదిగో దానితల్లి యైన సింహము నీమీఁదికి దుముకును.

బాలు—(చిఱునవ్వుతో) ఓహో! నేను మిక్కి-లి బెదరిపోతిని గదా! (అని యధరోష్ఠమును జూపుచున్నాఁడు.)

రాజు—క. బాలుఁ డితఁడు బహుతేజ
శ్శాలికి జనియించినట్లు సంభావింతున్;
జాలఁగ గట్టెలఁ గోరెడు
కీలికణంబట్ల వీఁడు కేవల మలరున్.

ప్రథమ—వత్సా! ఈ బాలమృగేంద్రమును విడువుము. నీ కాడుకొనుటకు మఱి యేదైన నిచ్చెదను.

బాలు—ఏదీ? అది తెమ్ము. (అని చేయిచాచుచున్నాఁడు.)

రాజు—ఎందుచేతనో యితఁ డీచేతియందుఁ జక్రవర్తిలక్షణములను సహితము ధరించి యున్నాఁడు. అవును—

ఉ. కోరినవస్తువుఁ గొనఁగఁగోరి యొకించుక వ్రేళ్ళు వంచి యుం
ఫారఁగఁ జాఁచినట్టి మృదుహస్తము రక్తిమచేతనొప్పుచుఁ
జారుదళాంతరాళము గనంబడకుండు ప్రభాతపుష్పితాం
భోరుహసుందరంబయి యపూర్వముదావహ మయ్యెదృష్టికిన్.

ద్వితీయ — సువ్రతా! వీఁడు మాటలచేత మరలించుటకు శక్యుఁడు కాఁడు. నీవుపోయి మా పర్ణశాలలో మార్కండేయుఁ డను ఋషికుమారునియొక్క రంగువేసిన మట్టినెమలి యున్నది. దానిని వీనికిం దెచ్చియిమ్ము.

ప్రథమ — మంచిది. (అని నిష్క్రమించుచున్నది.)

బాలు — నేను దీనితోనే యాడుకొనియెదను.

(అని తాపసినిజూచి నవ్వుచున్నాఁడు.)

రాజు — ఈ దుండగీనియెడ నాకపేక్ష కలుగుచున్నది!

ఉ. హేతువులేని నవ్వుల నొకించుక చూపుచు లేతదంతముల్,
వా తెరచింద నందముగఁ బల్కుచు స్పష్టము కానివాక్కులన్,
భూతలధూళి దేహమునఁ బూయుచు మైలయొనర్చు పుత్రులం
బ్రీతిని ధన్యు లెత్తి తొడమీఁదను జేర్చి సుఖింతు రెంతయున్.

తాపసి — కానిమ్ము. వీఁడు నన్ను గణన చేయకున్నాఁడు (పార్శ్వమునఁజూచి) ఋషికుమారులలో నిక్కడ నెవఁడున్నాఁడు? (రాజునుచూచి) ఓ ప్రసన్నవదనా! ఇటువచ్చి, వీఁడు చిన్నతనముచేత జేతులతో విడిపింపశక్యముకాని పట్టుపట్టి బాధించుచున్న యీ సింహపు బిల్లను విడిపింపుము.

రాజు — (దగ్గఱకుఁబోయి చిఱునవ్వుతో) ఓయీ! మహర్షి కుమారా!

గీ. పుట్టుకను సత్వగుణమును బూనఁదగియు,
నీకరణి నాశ్రమవిరుద్ధ వృత్తిచేతఁ
జెలఁగుచును శాంతగుణమును జెఱిచె దేల ?
చందనకుజంబుఁ గృష్ణాహిశాబమట్లు.

తాపసి—ఓ ప్రసన్నముఖుఁడా ! వీఁడు ఋషికుమారుఁడు కాఁడు సుమీ.

రాజు—వీని యాకారానుగుణ మయినచేష్టితమే యది తెలుపు చున్నది. అయినను మేము స్థానవిశ్వాసముచేత నీవిధముగాఁ దలఁచితిమి. (అని యామె చెప్పినప్రకారముచేసి బాలస్పర్శనసుఖము పొంది తనలో)

గీ. ఎవ్వనికులాంకురంబాయె యెసఁగు నితని
నంటు నా గాత్రమున సుఖ మబ్బ నిట్టు
లెవనికడుపునఁ బుట్టెనో యీతఁ డట్టి
సుకృతి మదిలోన నెటువంటిసుఖము గనునొ ?

తాపసి—(ఉభయులనుజూచి) ఆశ్చర్యము ! ఆశ్చర్యము !

రాజు—అమ్మా ! ఎందుచేత ?

తాపసి—ఈ బాలకునకును నీకును రూపము చుట్టఱికమును దెలుపుచున్నదని యాశ్చర్యపడినదానను. అపరిచితుఁడవయ్యును, నీకితఁ డనుకూలుఁ డయ్యెననియు నాశ్చర్యపడితిని.

రాజు—(బాలుని బుజ్జగించుచు) ఇతఁడు మునికుమారుఁడు కాఁడేని, మఱి యీతనికుల మేది ?

రాజు—(తనలో) ఈతఁడు నాకేకవంశము వాఁడెట్లయ్యెను ? అందుచేతనేగదా యీమె యీతనిని నన్నుఁ బోలినవానినిగాఁ నెంచి

నది. పౌరవులకుఁ గులక్రమాగతమయిన యీ వ్రత మంత్యమువ నున్నదే.

గీ. వసుమతీరక్షణార్థ మెవ్వారు తొలుత
వాస మొనరింతురో దివ్యభవనములను,
వారు పిదప నియతతపోవ్రతము పూని
వృక్షమూలము లిండ్లు కావించుకొంద్రు.

(ప్రకాశముగా) ఈ ప్రదేశము స్వశక్తిచేత మనుష్యులకు రా శక్యమయినది కాదుకదా?

తాపసి—తమరు చెప్పినట్లే యగును. అప్సరస్సంబంధముచే వీని తల్లి యీ దేవగురుని తపోవనమునందుఁ బ్రసవ మయినది.

రాజు—(తనలో) ఆహా! ఈ వాక్యము మరల నా కాశను బుట్టించుచున్నది! (బిగ్గరగా) ఆమె యే పేరుగల రాజర్షి భార్య!

తాపసి—ధర్మపత్నిని విడిచిపెట్టిన వానిపే రెవ్వ రుచ్చరింపఁ దలఁతురు?

రాజు—(తనలో) ఈ కథయు నాకే తాఁకుచున్నదిగదా! ఇప్పుడీ పిల్లవానితల్లి పేరడుగుదునా? (ఆలోచించి) అట్లుకాదు. పర దార పేరడుగుట న్యాయముకాదు.

తాప—(మట్టినెమలిని చేతఁబట్టుకొని ప్రవేశించి) సర్వదమనా! శకుంతలసతౌందర్యంబు చూడుము.

బాలు—(దృష్టిసారించి) మాయమ్మ యెక్కడ?

ప్రథమ—నామసాదృశ్యముచేత మాతృవత్సలుఁడైన యీతఁడు భ్రమపడెను.

ద్వితీ.—వత్సా! ఈ పక్షియొక్క యందమును జూడుమని పలికితిని.

రాజు—(తనలో) ఏమి! ఈతని తల్లి పేరు శకుంతలయా? అయిన నేమి? ఒక్కపేరుగలవారు పలువురుందురు. నామధేయమాత్రప్రస్తావము నా కెండమావివలె విదాహంబు కలిగించుచున్నది.

బాలు—అమ్మా! ఈ మంచినెమలి నాకు రమ్యముగానున్నది. (అని దానిని పుచ్చుకొనుచున్నాఁడు.)

ప్రథమ—(చూచి తొందరతో) ఈతని తాయెంతు మణికట్టున గానఁబడదు.

రాజు—తొందరపడఁబోకు. ఓ తాపసీ! ఇది సింహశాబముతోఁ బెనఁగులాడినప్పుడు జాఱిపడినది. (అని తీసియియ్యఁబోవుచున్నాఁడు.)

ఇద్ద—తీయకు తీయకు. ఈతఁడు తొందరపడి దీనినెల్లు తీసెను! (అని యద్భుతపడి తొమ్మునఁ జేయివేసికొని యొండొరులను చూచుకొనుచున్నారు.)

రాజు—నన్ను మీరేల నివారించితిరి!

ప్రథమ—ఓ మహారాజా! వినుము. ఇది యీ చిన్నవానికి జాతకకర్మసమయమునందుఁ ద్రికాలవేదియైన మరీచమహర్షి యిచ్చిన యపరాజిత యనునోషధి. దీనిని దల్లిదండ్రులును దానునుదక్క భూమి మీఁదివారు మఱియొకరు ముట్టకూడదు.

రాజు—ముట్టుకొన్న నేమి?

ప్రథ—అప్పుడ పామయి కఱచును.

రాజు—మీరెప్పుడైన దీనివిక్రియను బ్రత్యక్షముగాఁ జూచి యున్నారా!

ఇద్ద—అనేక పర్యాయములు.

రాజు—(హర్షముతో తనలో) ఇప్పుడు సంపూర్ణమయిన నామనోరథమునకు నే నెట్లు సంతోషింపకుందును! (అని బాలకుని కౌఁగిలించుకొనుచున్నాఁడు.)

ద్వితీ—సువ్రతా! రమ్ము. ఇప్పుడీవృత్తాంతమును వ్రతనిష్ఠయందున్న శకుంతలకుఁ దెలుపుదము. (అని నిష్క్రమించుచున్నారు)

బాలు—నన్ను విడిచిపెట్టుము. నేను మా యమ్మదగ్గఱకుఁబోవలెను.

రాజు—పుత్రకా! నాతోఁగలిసియే తల్లిని సంతోషపెట్టుదువు గాని.

బాలు—నాకు దుష్యంతుఁడుగదా తండ్రి? నీవు కావు.

రాజు—(చిఱునవ్వుతో) ఈ వివాదమే నాకు విశ్వాసము కలిగించుచున్నది.

[అప్పు డొక్కజడగా నల్లుకొన్నతలతో శకుంతల ప్రవేశించుచున్నది]

శాకుం—వికారకాలమునందు సహితము స్వభావరూపమున నున్న సర్వదమనుని దోషధిసంగతి వినియు నాకు నా భాగ్యమునందు నమ్మకము కలుగకున్నది. ఒకవేళ సానుమతి చెప్పిన ప్రకారముననే యిది సంభవింపను వచ్చును.

రాజు—(శకుంతలవంకఁజూచి) ఆహా! ఇదిగో పూజ్యురాలయిన శకుంతల!

గీ. మిగుల మాసినవస్త్రంబు మేనఁ దాల్చి,
నియమకృశముఖ యేకవేణిని ధరించి,
శుద్ధశీలయై, యతిదయాశూన్యుఁడనగు
నాదు చిరవిరహవ్రతి యీనాతి దాల్చె.

శకుం.—(పశ్చాత్తాపముచేత వివర్ణుఁడయియున్న రాజును జూచి) ఇతఁడు నాభర్తవలె నుండలేదు. మఱియెవ్వఁడితఁడిప్పుడు రక్షకట్టియున్న నాపుత్రకుని గాత్రసంసర్గముచేత మయిల యొనర్చుచున్నాఁడు!

బాలు.—(తల్లి నిజేరి) అమ్మా! ఎవడితఁడు నన్నుఁ గొడుకని పిలిచి యాలింగనము చేసికొనుచున్నాఁడు?

రాజు.—ఓ ప్రియురాలా! నీయెడల నేను జూపిన క్రూరకృత్యమును గడపట ననుకూలఫలము నిచ్చునదియే యైనది. ఎందుచేతనన నీవిప్పుడు నన్నానవాలు పట్టఁగలిగితి వనుకొనియెదను.

శకుం.—(తనలో) హృదయమా! ఊఱడుము. మత్సరము విడిచి దైవము నాయందుఁ గరుణించెను. ఈతఁడు నా భర్తయే.

రాజు.—ప్రియురాలా!

గీ. సుముఖిరో! భాగ్యమున, మోహతమను వీడి
స్మృతినిగన్న నాముందల వసించె దీవు;
సత్వరంబుగ గ్రహణావసానమునను
శశిని జేరినరోహిణిసరణి నిపుడు.

శకుం.—ప్రాణేశ్వరా! జయ మగుఁగాక! జయ మగుఁగాక! (అని సగము చెప్పి కన్నీటిచే గద్గదస్వరముపడి విరమించుచున్నది)

రాజు.—సుందరీ!

గీ. గళమునని జయశబ్దంబు కనులనీట
నడఁగినను, నేను ధన్యుండ నైనవాఁడ;
సంస్క్రియులు లేక పాటలోష్ఠంబుఁ గలిగి
చెలువగుముఖంబుఁ జూడఁ గాంచితిని గాన.

బాలు—అమ్మా! ఇతఁ డెవరు?

శకుం—బిడ్డా! నీ భాగ్యమును నడుగు.

రాజు—(శకుంతల పాదములమీఁదఁ బడి)

మ. అవమానించితి నంచుఁ జింతిలకుమీ యావంతయు న్నీమదిన్ ;
దవిలెన్మోహము గాఢమై యపుడు మత్స్వాంతంబులో నేలొకో!
భువి నిట్లుందుఁ దమఃప్రధానులమనంబుల్ భద్రముల్ వచ్చుచోఁ ;
బువుదండం దలనుండి పామనుభ్రమన్ బోఁద్రోయఁడే యంధుఁడున్!

శకుం—లెమ్ము ప్రాణేశ్వరా! లెమ్ము. ఆ దినములయందు నా పుణ్యప్రతిబంధకమైన పూర్వజన్మ దుష్కృతము పండిపోయెను. నిశ్చయము. అట్లు కానియెడల, సదయు లయ్యును దేవరవారు నా యెడల విరసత్వము నేల వహింతురు? (రాజు లేచుచున్నాఁడు.) మఱి దుఃఖభాగినినైన నేను దేవరవారి కెట్లు స్మరణకు వచ్చితిని?

రాజు—శోకనివారణము చేసికొని చెప్పెదను.

గీ. అధరమును బాధచేయు నీ యశ్రుకణము
మోహమున నుపేక్షించితి మున్ను నేను ;
కదలు కనుఱెప్పలందలి యుదకబిందు
విపుడు తుడిచి నే ననుతాప మెడలువాఁడ.

(అని చెప్పినట్లు చేయుచున్నాఁడు.)

శకుం—(పేరు చెక్కిన ముద్దుటుంగరముచూచి) ప్రాణేశ్వరా! ఆ యుంగరమా యిది?

రాజు—ఈ యుంగరము లభించుటవలననే నాకు స్మరణ పుట్టినది.

శకుం—దేవరవారికి నమ్మకము పుట్టింపవలసిన కాలముననే యిది కనఁబడక కష్టము తెచ్చిపెట్టినది.

రాజు—అట్లయిన, లత ఋతుసమాగమమును సూచించు పుష్పమునుంబోలె నీవు దీనిని గ్రహింపుము.

శకుం—దీనియందు నాకు విశ్వాసములేదు. దీనిని భర్తయే ధరింపవలయును.

[అప్పుడు మాతలి ప్రవేశించుచున్నాఁడు]

మాత—ఏమి నీ భాగ్యము! నీవు ధర్మపత్నీ సమాగమము చేతను, పుత్రముఖదర్శనముచేతను వర్ధిల్లుచున్నావు.

రాజు—నా మనోరథము మంచిఫలమును బొందినది. మాతలీ! ఈ వృత్తాంత మింద్రునకుఁ దెలియదుగదా?

మాత—(చిఱునవ్వుతో) ప్రభువులకుఁ దెలియని దేముండును; దేవా! రమ్ము. మహాత్ముఁడయిన కశ్యపుఁడు నీకు దర్శన మిచ్చుచున్నాఁడు.

రాజు—శకుంతలా! కొడుకుం బట్టుకొనుము. నిన్ను ముందుంచుకొనియే మహర్షిని జూడఁగోరెదను.

శకుం—ప్రాణనాయకునితోఁగూడ గురుని సమీపమునకుఁ బోవుటకు సిగ్గుపడుచున్నాను.

రాజు—అయినను అభ్యుదయకాలములం దిట్లు చేయవలెను. రమ్ము రమ్ము. (అని యందఱును నడుచుచున్నారు.)

[అప్పు డదితితోఁగూడ సింహాసనస్థుఁ డయిన కశ్యపుఁడు ప్రవేశించు చున్నాఁడు.]

కశ్య——(రాజువంకఁ జూపి) ఓ దక్షపుత్రీ !

ఉ. ఎంతయు నీదుపుత్రునకు నీతఁను సోదఱు ముందు నిల్చి దు
ష్యంతధరాతలేశ్వరుఁడు సంగరరంగమునందు వింటిచే
సంతత మెల్ల కార్యములుఁ జక్కఁగఁ నిర్వహణం బొనర్ప, ని
శ్చింతత భూషణంబె యగు జేతికి వజ్రము గోత్రభేదికిన్.

అదితి——ఈతని యాకారము సంభావనీయ మహాత్మ్యముగలది.

మాత——(రాజుతో) ఆయుష్మంతా ! దేవతలకు జనకులయిన వీరు పుత్రప్రీతి సూచకములయిన కన్నులతో నిన్నుఁ జూచుచున్నారు. కాఁబట్టి వారి సమీపమునకు వెళ్లుము.

రాజు——మాతలీ !

శా. వీరా దక్షమరీచిసంభవతచేఁ బెంపొందుచున్, బ్రహ్మకు
న్దారే రెండవమెట్టువారయి, తెగక బంద్రెండుగూపంబు లో
న్బారం దాల్చెడు తేజముం గని, త్రిలోకాధీశు నాయాగభు
గ్వారేశుం గని, పద్మజాధికు హరిం గన్నట్టి సద్దంపతుల్ !

మాత——మఱియేమి ?

రాజు——(సాగిలఁబడి) ఇంద్రనియోజ్యుఁడయిన దుష్యంతుఁడు మీ యిరువురకును నమస్కరించుచున్నాఁడు.

కశ్య——వత్సా ! దీర్ఘాయుష్మంతుఁడ వయి భూమి నేలుము.

అదితి——పుత్రకా ! ఎదురు లేనివాఁడవు కమ్ము.

శకుం——పుత్రసహితురాలైన నేను మీ పాదాభివందనము చేయుచున్నాను.

కశ్య——బిడ్డా !

క. పెనిమిటి యింద్రసమానుఁడు;
తనయుఁడును జయంతసముఁడు; తగ వీఁకఁ బెఱదీ
వన లేమియు నీ కఱవా!
కనుమా శచితోడిసాటి ఘనముగ నీవున్.

అదితి—బిడ్డా! భర్తృసమ్మానము పొందుదానవుగమ్ము. ఈ చిన్నవాఁడు దీర్ఘాయుష్మంతుఁడై తప్పక యుభయకులములను సంతోష పెట్టునుగాక! కూరుచుండుఁడు.

(అందఱును కశ్యపున కెదురుగఁ గూరుచున్నారు.)

కశ్య—(ఒకరొకరిని నిర్దేశించి)

గీ. ఈ శకుంతల కడు సాధ్వి; యితఁడు చూడ
మంచిపుత్రుఁడు; నీవును మానవనిధివి;
మీరు మువ్వురు భాగ్యంబునఁ జేకొనుట
శ్రద్ధయు ధనంబు విధియుఁ జేరంగఁ గనుట.

రాజు—దేవా! ముందే యభిమతార్థసిద్ధి యయి తరువాతఁ దమదర్శనము లభించినది. అందుచేత మీయనుగ్రహ మపూర్వము కదా! ఎట్లన—

గీ. తొలుతఁ బూవును తరువాత ఫలముఁ గల్గు;
మొదల మేఘ ముదరి వాన పిదపఁ గురియు;
కార్యకారణముల కిది క్రమము చూడ;
నీ ప్రసాదంబునకు ముందె నిగుడు సిరులు.

మాత—సృష్టికర్త లీ ప్రకారముగానే ప్రసన్ను లగుదురు.

రాజు—ఓ భగవాన్మునీ! నీ సేవకురాలిని గాంధర్వవివాహ విధిచేతఁ బెండ్లియాడి, కొంతకాలమునకు బంధువులు తీసికొని వచ్చి నప్పుడు నేను గొప్పమఱపుచే నిరాకరించి, పూజ్యుఁడును యుష్మ ద్గోత్రుఁడు నయిన కణ్వునియెడ నపరాధినైతిని. తరువాత, నీ యుంగ రమును జూచుటవలన నాతనికొమార్తెను బూర్వము వివాహమాడినట్లు తెలిసినది. నా కది చిత్ర మయి తోఁచుచున్నది.

గీ. ఎదుటఁ గన్పింప గజము కా దిది యటంచు
నెంచి, యది దాఁటిచన సంశయించి, పిదప
నడుగుజాడలు గని గజం బనుచు నమ్ము
కరణి నయ్యె నాచిత్తవికార మహహా!

కశ్య—వత్సా! అపరాధము చేసితి వని శంకింపఁబోకు. నీవు సమ్మోహపడుటయు ననుపపన్నముకాదు. వినుము.

రాజు—అవహితుఁడనై యున్నాఁడను.

కశ్య—అప్సర స్తీర్థమునుండి మిక్కిలి ఖిన్నురాలయియున్న శకుంతలను దీసికొని మేనక దాక్షాయణియొద్దకు వచ్చినప్పుడే నేనం తయు ధ్యానముచేతఁ దెలిసికొంటిని. దుర్వాసశ్శాపమువలన సహధర్మ చారిణియు, దీనురాలు నైన యీామెను నిరాకరించితివిగాని మఱి యొకటి కాదు. ఉంగరమును జూచినతోడనే యా శాపవిముక్తి యయినది.

రాజు—(నిట్టూర్పుపుచ్చి) ఇప్పుడు లోకాపవాదమునుండి విము క్తుఁడ నైనాఁడను.

శకుం—(తనలో) మేలు! భర్త నన్ను నిరాకరించినందుకుఁ గారణము లేకపోలేదు. నేను శపింపఁబడినట్టు నాకు స్మరణకురాలేదు.

ఒకవేళ విరహముచేత నస్వస్థచిత్తురాలనై నే నాశాపమును బొంది యే యుందును. నాకది తెలియలేదు. అందుచేతనే నాసఖులు భర్త యుంగరమును జూపుమని నాకు బోధించిరి.

కణ్వ—కుమారీ! కృతార్థురాల వైతివి. భర్తమీఁద నీవు కోప మ్ముంచఁగూడదు. చూడు,

చ. పతి స్మృతిలేక శాపహతి పాలయి నిన్విడనాడెఁ గ్రూరతన్;
సతి! విను మిప్పు డా తమము జాఱుటఁ బ్రాభవమెల్ల నీదెయౌ
నతిమలినంపుదర్పణమునందుఁ దగం బ్రతిబింబ మేర్పడన్
జతపడకుండియు న్మరల స్వచ్ఛత గాంచిన నీడ యౌనదే!

రాజు—మహాత్మా! ఇక్కడఁగదా నావంశము నిలిచినది!
(అని కుమారుని చేతితోఁ జేరఁదీయుచున్నాఁడు)

కణ్వ—ఇతఁడు భావిచక్రవర్తి యని తెలిసికొమ్ము.

ఉ. తిన్నఁగ నంతటం దిరుగుతేరిని వార్ధులు దాఁటి, యడ్డు లే
కున్నతి దీవులేడుగలయుర్వి జయించు నితండు సర్వమున్;
ము న్నిటఁబోల్చె సర్వదమనుం డన సత్వములం గలంచుటన్;
సన్నుతి కెక్కు లోకభరణంబుమెయిన్, భరతాఖ్య నీపయిన్.

రాజు—తమచే సంస్కారము పొందుటచే వీనియందు మే మిది యంతయుఁ గోరుదుము.

అదితి—స్వామీ! ఈ పుత్రికామనోరథసిద్ధి సవిస్తరముగాఁ గణ్వునకుఁ జెప్పి పుచ్చి యిప్పు డాతనిని సంతోషపెట్టవలెను. పుత్రికావత్సలయైన మేనకయు నాకుఁ పరిచర్యచేయుచు నిచ్చటనేయున్నది.

శకుం—(తనలో) నాకుఁ గల కోరిక నీమెయే చెప్పినదిగదా!

కణ్వ—తపఃప్రభావముచేతఁ గణ్వునకంతయుఁ బ్రత్యక్షమే.

రాజు—(తనలో) అట్లయిన నా ముని నాయెడల నతికోపము గలవాఁడుగా నుండఁడు.

కణ్వ—అయినను మేమాతని కీప్రియవార్తను బంపవలయును. ఓగీ! ఎవఁడురా అక్కడ ?

శిష్యుఁడు—(ప్రవేశించి) దేవా! ఇదిగో వచ్చినాఁడను.

కణ్వ—గాలవా! ఇప్పుడే యాకాశమార్గమునఁ బోయి పూజ్యుఁడైనకణ్వునితో "ఆ శాపము పోవుటచే స్మృతిమంతుఁడయిన దుష్యంతునిచేత శకుంతల పుత్రసహితముగాఁ బ్రతిగ్రహింపఁబడిన" దని నా వాక్యములుగాఁ బ్రియంబు తెలుపుము.

శిష్య—దేవర యాజ్ఞాపించినట్లు.

(అని నిష్క్రమించుచున్నాఁడు.)

కణ్వ—వత్సా! నీవును భార్యాపుత్రసహితుఁడవయి సఖుడయిన యింద్రునిరథ మెక్కి నీ రాజధానికి వెళ్ళుము.

రాజు—దేవరవారి యాజ్ఞాప్రకారము చేసెదను.

కణ్వ—మఱియును—

ఉ. వాసవుఁ డిచ్చు నీప్రజకు వర్షము లెల్లపుడు న్సమృద్ధిగా;
నాసురల న్మఖావళుల నందఱఁ దన్పుము నీవు నెప్పుడున్;
భాసిల స్వర్గమర్త్యభువనంబుల కిట్లు పరస్పరంబు సం
తోసముఁగూర్చుచు న్మనుఁచు నూర్లయుగంబులు మేలుచేఁతలన్.

రాజు—దేవా! యథాశక్తిని మేలు కూర్చుటకుఁ బ్రయత్నించెదను.

కణ్వ—వత్సా! నీకు మఱి యేమిప్రియము చేయవలెను?

రాజు—నాకింతకంటె నేమి ప్రియమున్నది? అయినను దేవర వారు ప్రియముచేయ నిచ్ఛించుచున్నారు గనుక, ఈ భరతవాక్యము సిద్ధించునుగాక!

చ. ప్రజలహితార్థమే నృపుఁడు వర్తిలుఁగావుత మెల్లయప్పుడున్!
సుజనులవిద్య పూజ్యయయి శోభ వహించునుగాక యెల్లెడన్!
నిజకృప నీలలోహితుఁడు నిత్యుఁడు శక్తిధరుండు నైనయా
గజదనుజారి పోనడఁచుఁగావుత నాకును మాఱుజన్మమున్!

(అని యందఱును నిష్క్రమించుచున్నారు.)

సంపూర్ణము.

అవంతీ ప్రెస్, రాజమండ్రి.

రత్నావళి.

ఇది

కాశ్మీరదేశపురాజైన శ్రీహర్షదేవునిచే విరచితమయిన
సంస్కృత నాటకమునుండి

కందుకూరి వీరేశలింగము పంతులుగారిచే
తెనిఁగింపఁబడినది.

ఐదవ కూర్పు.

ప్రకాశకులు:
హితకారిణీ సమాజము
రాజమహేంద్రవరము
1950

రాజమహేంద్రవరమున
బొలిసెట్టి వెంకటరమణయ్య అండ్ సన్సువారిచే
శారదా ముద్రాక్షరశాలయందు
ముద్రింపబడియె.

ఈ నాటకమునందు వచ్చు పాత్రలు.

పురుషులు

ఉదయనుఁడు లేక వత్సుఁడు—కౌశాంబీపురాధీశ్వరుఁడు.

యౌగంధరాయణుఁడు—ఉదయనుని ప్రధానమంత్రి.

వసంతకుఁడు—విదూషకుఁడు; రాజునకు వేడుకచెలికాఁడు.

వసుభూతి—సింహళద్వీపపురాజు మంత్రి.

బాభ్రవ్యుఁడు—యౌగంధరాయణునిచే సింహళమునకుఁ బంపఁబడిన కంచుకి.

విజయవర్మ—ఉదయనుని సేనయందలి యొకయధికారి; రుమణ్వంతుని మేనల్లుఁడు.

సంవరణసిద్ధి—ఐంద్రజాలికుఁడు.

స్త్రీలు

వాసవదత్త—ఉదయనుని పట్టమహిషి.

రత్నావళి లేక సాగరిక—సింహళదేశపు రాజుకూఁతురు.

కాంచనమాల—వాసవదత్త కాప్తురాలైరాలయిన ప్రధాన సేవకురాలు.

సుసంగత—సాగరిక కాప్తురాలయిన సేవకురాలు.

నిపుణిక—ఒక సేవకురాలు.

మదనిక—ఒక సేవకురాలు.

చూతలతిక—ఒక సేవకురాలు.

వసుంధర—అంతఃపుర ద్వారపాలకురాలు.

ర త్నా వ ళి

ప్ర థ మా ం క ము

నా ం ది.

మ. చరణాగ్రంబులనిల్చి, సారెకు నురోజప్రోన్నతిన్ మ్రొగ్గుచున్,
హరునర్పింపఁగ లోచనత్రయు పదంబాసక్తితోఁ బొంది, హ్రీ
భరతన్ మేన్పులకించి కంపిలి చెమర్పంగా, శిరంబందు నీ
శ్వరిపుష్పాంజలి చిమ్మ, జాటి యదిక్షిప్తంబై మిముం బ్రోచుతన్!

మ. హృదయౌత్సుక్యము వేగిరింప, సహజహ్రీ క్రమ్మరింపన్, జెలుల్
మృదువాక్యోక్తిఁ బ్రియాభిముఖ్యమును గల్పింపన్, మనోవల్లభుం
డెదుటం దోఁచుట భీతి యేప, నగి యాత్మేశుండు తోల్యాటమిన్
బొందుగం గౌఁగిట స్విన్నయౌ గిరిజ యొప్పున్ మీకు మేల్గూర్చుతన్! ౧.

మ. సవనధ్వంసమునందు విప్రుల రుషాంచద్దృష్టిఁ జల్లార్చుటల్,
తివియంగాఁ బ్రమథాళి జుట్టొడిసి భీతిన్ ఋత్విజుల్లూలుటల్,
స్తవముల్సల్పుచు దక్షు వాలడలుటల్, ధాత్రీసురుల్వాఱుటల్,
శివతోడ న్వివరించు సాంబశివుఁడోలిన్ మీకిడున్ శ్రేయముల్! ♦

♦ కొన్ని ప్రతులలో దీని తరువాత నాందిలోనే యీ క్రిందియర్థమిచ్చు శ్లోక మొక్కటి కానఁబడుచున్నది గాని యది ప్రక్షిప్తమని తోఁచుచున్నది.—

గీ. శశికిజయమగాత! సురలకంజలిఘటింతు.
సత్తమబ్రాహ్మణులకు మేలొదవుఁ గాక!
క్ష్మాసతి సమృద్ధసస్యయౌఁ గాక సతము!
చంద్రకనుఁడు రాజప్రతాపావళియగుత!

నాంద్యంతమందు సూత్రధారుఁడు

సూత్ర—అతివిస్తారము వలదు. ఇప్పుడు వసంతోత్సవము నిమిత్తము సబహుమానముగా నాహ్వానము చేయఁబడి నానాదిగ్దేశములనుండి వచ్చియున్న శ్రీ శ్రీహర్ష దేవ పాదపద్మోపజీవులయిన రాజులసమూహము "మనస్వామియైన శ్రీ శ్రీ హర్ష దేవు నిచే నపూర్వవస్తు రచనాలంకృతముగా రత్నావళియనునాటిక రచియింపఁబడినదని శ్రోత్రపరంపర చేవినుటయే కానిప్రయోగింపఁ గాఁ జూచియుండలేదు కాఁబట్టి సకల జనహృదయాహ్లాదకరులైన రాజుగారియందలి గౌరవముచేతను మాయెడలఁగల యనుగ్రహబుద్ధిచేతను నీవు దానిని ప్రయోగించియాడవలెను." అని నన్నడిగెను. అట్లగుట వలన నేను నేపథ్యరచనను జేసి యిప్పుడు వారియభిలాషమును దీర్చెదను. (చుట్టునుదిరిగిచూచి) ఈ సకలసామాజికులును నిండు మనస్సులతోనున్నారని నేను నిశ్చయముగాఁ దలఁచెదను.

మ. కడు శ్రీహర్షుఁడు ప్రౌఢసత్కవి; గుణగ్రాహుల్స భాస్తారులున్;
బుడమిన్వత్సచరిత్ర సుందరము; మమ్మున్ దక్షులం డ్రాటలో;
నొడఁగూర్పందగు వాంఛితార్థముల నిందొండొండె నా,నిచ్చటన్
వడిఁజేకూరెను సర్వలాభములు మద్భాగ్యంబునిం కేమనన్?

కాఁబట్టి నేను గృహమునకుఁబోయి గృహిణిఁబిలిచి సంగీతముప్రక్రమించెదను. (అని పరిక్రమించి తెరవంకఁ జూచి) ఇదె నాగృహము. ఇందుఁ బ్రవేశించెదను. (బిగ్గఱగా) ఓసీ! ఇటురమ్ము.

నటి—(ప్రవేశించి)అయ్యా! ఇదిగో వచ్చితిని. ఏనియోగము ననుష్ఠింప వలయునో యాజ్ఞాపింపుఁడు.

సూత్ర—ఓసీ! ఈ రాజలోకము రత్నావళీ దర్శనోత్సుకమైయున్నది. కాఁబట్టి నీవలంకరించుకొమ్ము.

నటి—(నిట్టూర్పు విడిచి కంపముతో) అయ్యా! మీరిప్పుడు నిశ్చింతులుగా నున్నారు. మందభాగ్యురాలనైన నాకొక్క తెయే కూఁతురు; దానిని మీరేదో దేశాంతరమునం దియ్యమంటిరి; అందుచేర దూర దేశస్థుఁ డయిన భర్తతో దానికి పాణిగ్రహణ మెట్లు కలుగునా యని నాకెప్పుడు నదేచింతగా నున్నది. దీనిని మీరేల తలఁపరు? ఇట్టి విచారముతో నే నెట్లు నాట్యము నిర్వహింపఁగలను?

సూత్రి—ఓసీ! దూరస్థుఁడని విచారపడఁబోకు. చూడు—

గీ. దైవ మనుకూల మగు నేని, తడవు లేక
యభిమతార్థంబుఁ దెచ్చి ద్వీపాంతరంబు
నుండియైన, దిగంతంబు నుండియైన,
జలధినడుమనుండియు నైన, సంఘటించు.

(నేపథ్యమునందు)

సాధు ! భరతపుత్రా ! సాధు ! అదినిశ్చయము. అందుకు సందేహ మేమి ?

సూత్ర—(ఆలకించి నేపథ్యమువంకఁ జూచి) ఓసీ! ఇంకను కాలవిలంబ మేల చేసెదవు? అదె నాతమ్ముఁడు యౌగంధరాయణ వేషమును ధరించి వచ్చి యున్నాఁడు. కాఁబట్టి నీవురమ్ము. మనమును ననంతరకరణీయ వేషరచనను సిద్ధము చేయుదము.

(అని యిద్దఱును నిష్క్రమించు చున్నారు.)

ఇది ప్రస్తావన.

రత్నావళి

ప్రథమాంకము

ప్రదేశము — కౌశాంబీనగరము.

[అప్పుడు హృష్టుఁడగు యౌగంధరాయణుఁడు
ప్రవేశించుచున్నాఁడు.]

యౌగం — అది సత్యము. అందుకు సందేహమేమి?

గీ. దైవ మనుకూల మగునేని, తడవు లేక
యభిమతార్థంబుఁ దెచ్చి, ద్వీపాంతరంబు
నుండియైన, దిగంతంబునుండి యైన,
జలధినడుమునుండియు నైన సంఘటించు.

అట్లు కానిపక్షమున, ఆమెను వివాహమాడువాఁడు మహాభాగ్యశాలి యగునని సిద్ధుఁడు చెప్పినమాటను నమ్మి నేనడుగఁబంపిన సింహళ రాజపుత్రిక సముద్రమధ్యమున నోడ పగిలి మునిఁగిపోవునపుడు పలక దొరకి బ్రతుకుట యెక్కడ? సింహళద్వీపమునుండి తిరిగి వచ్చుచున్న కౌశాంబీపురవర్తకుఁ డట్టియవస్థలో నున్నయామెను రత్నహారముచే గుఱుతుపట్టి యిచ్చటికి సురక్షితముగాఁ దీసికొనివచ్చి నాకిచ్చుట యెక్కడ? (హర్షముతో) ఏవిధమునఁ జూచినను మనరాజుగారి కిప్పుడు మంచిదినములు వచ్చినట్లు కనఁబడుచున్నవి. (ఆలోచించి) నేనును ఆచిన్నదానిని సగౌరవముగా రాణిగారి సంరక్షణమున కొప్పగించుట మంచిపనియే చేసియున్నాను. ఆమెను తీసికొనివచ్చుటకయి వెళ్ళిన బాభ్రవ్యుఁ డనుకంచుకియు, తోడుగా పంపఁబడిన సింహళ ద్వీపాధిపతిమంత్రి యగువసుభూతియు ఏలాగుననో సముద్రతీరమును జేరి, కోసలరాజును శిక్షించుటకయి మనచేఁ బంపఁబడిన రుమణ్వాంతునితోఁ గలిసికొన్నారనియు విన్నాఁడను. వీనినన్నిఁటినిబట్టి చూడఁగా స్వామికార్యము సఫల మయినట్లే. అయినను, నాకుమాత్రము ధైర్యము కలుగకున్నది. భృత్యత్వ మెప్పుడును కష్టమయినదికదా!

గీ. స్వామియభివృద్ధి కీపని సలిపినాఁడ;
సాయపడియెడు దైవంబుఁ జేయియిచ్చి;
అగు నమోఘంబె సిద్ధోక్తి; యట్టు లయ్యె
స్వామి కెఱిఁగింపకునికి నే జడియవలయు.

[తెరచాటున కలకలము]

(ఆలకించి) అహా! మధురముగా వాయించుచున్న మద్దెలల మృదు నాదముతో మిళితమయి శ్రావ్యమయిన సంగీతముతో పౌరులచర్చరీ ధ్వని యెంత మనోహరముగా బయలువెడలుచున్నది! ఈ మదన మహోత్సవమునందుఁ బ్రవర్తించుచున్న పురజనులయొక్క యత్యధిక సంతోషమును జూచుటకయి రాజుగా రిప్పుడు మేడమీఁది కెక్కుదు రని యూహించెదను. (పయివంకఁ జూచి)అదె ప్రభువుగా రప్పుడే మేడమీఁది కెక్కియే యున్నారు.

చ. అమరఁగ విగ్రహంబు విడనాడి, కదుర్ణ రతిమంతుఁ డౌచు, ని
త్యమును జనాళిచిత్తములయందె వసించుచు, వేడ్కతో సుహృ
త్తమును వసంతకుం గలసి, దర్పకుఁడే తనయుత్సవంబునం
దముఁ గనవచ్చెనో యనఁగఁ దా నలవత్సనృపాలుఁ డొప్పుగున్.

ఇఁక నేనింటికివెళ్ళి ముందుచేయవలసిన కార్యమునుగుఱించి యాలోచించెదను. (నిష్క్రమించుచున్నాఁడు)

[వసంతోత్సవమునకుఁ దగిన వేషము వేసికొని, పీఠముమీఁదఁగూరుచుండి వసంతకునితోఁగూడ రాజు ప్రవేశించుచున్నాఁడు]

వత్స—(సంతోషముతో) ఓయీ! వసంతకా!

వసం—స్వామీ! ఏమి సెలవు?

వత్స—సీ. రాజ్య మంతయుఁ జాల రాజిల్లు చున్నది
లేశంబు రిపుబాధ లేక యుండ
కార్యభారము నెల్ల గౌరవ మారంగ
యోగ్యుఁడౌ మంత్రియం దుంచినాఁడ
సత్పాలనముచేత సంతుష్టులై యున్న
వారలు ప్రజలెల్ల బాధలేక
ప్రద్యోతనందన రసికురా లగుభార్య,
సంతోషకర మీవసంతవేళ
నీవు సఖుఁడవు; వీని యన్నింటిచేత
హృదయమునను నానందము వృద్ధి గనెను
నార! మన్మథోత్సవ మనుపేరె కాని.
యిదియు నామహోత్సవ మని యెంతు నేను.

వసం—మిత్రుఁడా! సత్యము. అయినను నేనిట్లు తలఁచెదను. ఇది మీదియుఁగాదు కామదేవునిదియుఁగాదు. ఎవని రాకచే నిట్లు శోభిల్లుచున్నదని ప్రియమిత్రులయిన దేవరవారు సెలవిచ్చియున్నారో, అట్టిబ్రాహ్మణవటువునయిన నాయొక్కనిదే యీమహోత్సవము. (చూచి) ఇక్కడ నేమున్నది? అదిగోముందుచూడుఁడు. మధుపానము చేత మత్తురాండ్రయిన కామినులు పెనఁగులాడి పుచ్చుకొని చిమ్మన గొట్టములతోఁ గొట్టుచున్న నీటిదెబ్బలకు గంతులువేయుచు నాగర జను లీప్రకారముగా సంతోషించుచున్నారో! అంతట నిండి బోరు కలఁగుచున్న మద్దెలనాదములచే నధికమగు చర్చరీధ్వనులతోను, ఒండొరులు చల్లుకొనుటచే దశదిశలయందును వ్యాపించిన గంధ వొడితోను, రాజవీధిచివరను జరుగుచున్న మహోత్సవముయొక్క శోభను అప్రక్కను జూడుఁడు.

వత్స—(సంతోషముతో కలయఁ జూచి) ఓహో! పౌరుల ప్రమోదమునకు పరిమితి గానరాకున్నది!

సీ. అల్లదె కనుఁగొనుమా ప్రక్కబుక్కాను
జను లొండొరులమీఁదఁ జల్లుకొనుచు
ప్రొద్దుటికెంజాయఁ బోలెడికుంకుము
పొడి దేహములనిండఁ బోసికొనఁగ
భరముచే వంగినశిరసుల నరజాతి
యలరులదండ లుయ్యాల లూఁగ
కాయమునిండ బంగరునీరు పూసిన
వడువునను బసిండివలువ లమరఁ
గనకభూషణసందోహ కాంతు లడర
విత్తపతికోశమును దనవిభవమునను
దెగడి కౌశాంబినగరంబు తేజరిలెడు
నెచ్చటనుగన్న నొక్కటే పచ్చనగుచు.

సీ. అప్పైని దిలకింపు మదిగో ధారాయంత్ర
ములనుండి పైకి జుమ్ముననుచు వెడలి
అంతట నిండు నిరంతర బహునీర
ధారలచేతను దడపఁబడుచు
హాయిగానృత్యంబు చేయుచు నున్నట్టి
జనసమూహంబుల చరణహతుల
గట్టిగానలిగినదట్టంపుటడుసొచు
నలరారుచున్న దీప్రాంగగణంబు
పడఁతులకపోలములనుండి పడెడునట్టి
సాంద్రసిందూరరజమును జనులు త్రొక్క

యరుణ మగుపాదములతోడ నందు నడువ
నెంతయును బురకుట్టిమం బెఱ్ఱనయ్యె.

వసం—(చూచి) మిత్రోత్తమా! ప్రౌఢులయినజనులు బలము గొలఁదిని లాగి విడుచుటచే చిమ్మనగ్రోవులనుండి బుస్సుమని వచ్చు నీటిధారలచేత మనోహర మయి వేశ్యాంగవలచేనొప్పుచున్న యీవైపు పునకుఁ జూడుము.

వత్స—(చూచి) నీవు చక్కఁగా కనిపెట్టితివి!

ద్విపద. బుక్కాపొడులచేతఁ బొడమినయట్టి
చిక్కనిచీఁకట్లు మిక్కిలి గ్రమ్మ
మణిమయకాంచన మండనకాంతు
లణుమాత్రము వెలుంగ నాసందునుండి
యెత్తినఫణములమొత్తంబు లనఁగ
నలభుజంగసమూహ మగపడి యిపుడు
తలఁపించెడును రసాతలమును మిగుల.

వసం—(చూచి) చెలికాఁడా! అదిగో మదనోత్సవమునకుఁ దగిన యభినయముతో వర్తించుచు, మదనికయు చూతలతికయు నీవంకనే వచ్చుచున్నారు. దేవర వారు చూడవలెను.

[మదలీలల నటించుచు, ద్విపదీఖండమును పాడుచు, ఇద్దఱు
చేటికలు ప్రవేశించుచున్నారు]

మద—(పాడుచున్నది)

ద్విపద. మావిగున్నల క్రొత్తతావులగొంచు
పూవుఁబోఁడులమానములు హరించుచును
మరుదూతయననొప్పు మలయమారుతము
కరము చల్లగ వీఁవగాఁ జొచ్చె నివుడు.

చూత—ద్విపద. విరిసినపొగడలు పరిమళింపంగ
కరమును బ్రియులరాకల నపేక్షించి
కాలహరణ మొనర్పఁజాల కియ్యెడను
జాలంగ జవరాండ్రు సంచరించెదరు.

మద & చూత—
ద్విపద. జనులడెందముల వసంతుండె యిపుడు
మునుమున్న మృదులంబు లొనరించి యుంచ,
ప్రసవాస్త్రుఁడావెన్క వడిగలయట్టి
కుసుమబాణంబులు గొంచుశాసించు.

వత్స—(చూచి) ఓహో! నిర్భయమయిన వీరియాయాట యెంత రమ్యముగా నున్నది!

సీ. మద్యపానముచేత మత్తెక్కియాడెడి
భామినులయురోజభారమునను
వంగిననడుమును వగపుతో వీక్షించి
యాబాధకును మూలమయినయట్టి
వక్షస్స్థలంబును శిక్షించుగతి హార
ములు మాటికిని ఱొమ్ము మోఁదఁదొడఁగె
కనుఁగొనఁగాలేక కాంతిహీనము లౌచు
సరగున విరిసరుల్ జాఱఁజొచ్చె
తాలుమూతౌచుఁ గేశబంధంబు వీడి
వ్యాకులతఁ జెందఁగాఁజొచ్చె నతిశయముగ
పాదములమీఁద వ్రాలి కంపంబు మిగుల
ద్విగుణముగ నందియలు మొఱపెట్టఁ దొడఁగె.

వసం—(నవ్వుచు) మిత్రుఁడా! నేనుకూడ బద్ధపరికరములు

గలవారి మధ్యను జేరి యాడుచుం బాడి, మదనమహోత్సవమును గారవింతువా?

వత్స—(చిఱునవ్వు నవ్వి) చెలికాఁడా! ఆలాగున నేచేయుము.

వసం—దేవరయాజ్ఞాప్రకారముగా చేసెదను. (లేచి, వారి మధ్యను నృత్యము చేయుచున్నాఁడు) ఓమదనికా! ఓసి చూత లతికా! ఈచర్చరీకమును నాకుఁ గూడ నేర్పెదరా?

మద—ఓయిభ్రష్టా! ఇది చర్చరీకము కాదు.

వసం—మఱియేమిటిది?

మద—ఇది ద్విపదీఖండము కాదా?

వసం—ఆలాగే కానిమ్ము. ఈఖండముతో మోదకములు చేసెదరా? లడ్డువులు చేసెదరా?

మద—(నవ్వి) కాదుకాదు. ఇది పాడెడిది కాదఁటయా?

వసం—(విస్మయముతో) ఇది పాడెడిదా! (విషాదముతో) ఇది పాడెడిదేయయి భుజించెడిది కానిపక్షమున దీనితో నాకుఁ బ్రయోజనములేదు. చక్కఁగా నాప్రియమిత్రునిదగ్గఱకే నేను పోయెదను. (అప్రకారముగా నడిచి యావలకుఁ బోయి కూరుచున్నాఁడు)

ఉభ—(ముందుకు లాగుచున్నారు)

వసం—(వెనుకకు లాగుచున్నాఁడు)

మద—(చేయి పట్టుకొని లాగుచు) ఓయిమూఢాత్మా! రా. ఎక్కడకుఁ బోయెదవు? ఇక్కడనే యాడుదము. (అనిబహువిధముల గొట్టుచున్నది)

వసం—(చేయి లాగుకొని, రాజుకడకు పడిగఁ బరుగెత్తి) మిత్రుఁడా! నేను నృత్యము చేసితిని.

వత్స—చెలికాఁడా! ఆడితివి.

వసం—కాదు. ఆడి పలాయితుఁడ నయితిని.

చూత—ఓసీ! మదనికా! మనము చాలసేపు నృత్యము చేసితిమి. రాణిగారిసందేశము నిప్పుడు మహారాజుగారికి విన్నవింతము రమ్ము.

మద—చూతలతికా! చక్కఁగా జ్ఞప్తికిఁ దెచ్చితివి! ఆలాగు నసే చేయుదము. (దగ్గఱకు వెళ్ళి) దేవా! జయము గుఁగాక! రాణిగారీప్రకారముగా నాజ్ఞాపించుచున్నారు—(అని సగము చెప్పి, లజ్జనభినయించి) కాదుకాదు. విజ్ఞాపించుచున్నారు.

వత్స—(హర్షముతో నవ్వి, సాదరముతో) మదనికా! ఆజ్ఞాపించుచున్నా రనుటయే రమణీయముగా నున్నది. విశేషించి యిది మదనమహోత్సవము. దేవిగా రేమి యాజ్ఞాపించినారు.

వసం—ఓసి దాసీసుతురా! ఏమి? దేవిగా రాజ్ఞాపించుచున్నారా!

ఉభ—ఈప్రకారముగా రాణిగారు విన్నవించుచున్నారు—నే నిప్పుడు మకరందోద్యానమునకు వెళ్ళి రక్తాశోకవృక్షముయొక్క మొదటను పూజనీయుఁ డయిన మన్మథుని స్థాపించి, పూజ చేయఁబోవుచున్నాను. అక్కడకు దేవరవారు విజయుంచేసి సన్నిహితులయి యుండఁదగును.

వత్స—మిత్రుఁడా! చెప్పవలసిన దేమున్నది? మనకు ఉత్సవములమీఁద నే యుత్సవములు వచ్చుచున్నవి.

వసం—మిత్రుఁడా! అట్లయిన లెమ్ము. మన మక్కడకే వెళ్ళుదము. అక్కడ బ్రాహ్మణబాలుఁడ నయిన నాకును స్వస్తివాచనిక మీఁదయిన లభింపఁ గలదు.

వత్స—మదనికా! నీవు వెళ్ళి, ఇదిగో మేమును మకరందోద్యానమునకు వచ్చితిమని రాణిగారితో విన్నవింపుము.

చేటికలు—దేవర సెలవు ప్రకారము చేసెదము.

(వెళ్లుచున్నారు.)

వసం—మిత్రుఁడా! దిగుదము రా!

(ఇద్దఱును మేడ దిగుట నభినయించుచున్నారు.)

వత్స—మిత్రుఁడా! మకరందోద్యానమునకు త్రోవతీయుము.

వసం—దేవా! రండి. రండి. (నడచుచున్నారు.)

వత్స—(ముందువంకఁ జూచి) అదిగో మకరందోద్యానము. అందుఁ బ్రవేశింతము రండి. (ప్రవేశించుచున్నారు.)

వసం—(విస్మయముతో) ఓ మహారాజా! చూడుము. చూడుము. మలయమారుతముచేఁ గదలుచున్న గుండ్రని తియ్యమామిడి పూగుత్తులను మేలుకట్టును గట్టుకొని, మదించినతుమ్మెద మొత్తముల ఝుంకారములతోఁ గలిసిన కోకిలాలాపములను సంగీతముచే సుఖము నిచ్చుచు, మకరందోద్యానము దేవర రాకకయి యాదరముతో నెదురు చూచుచున్నదానివలెఁ గనఁబడుచున్నది. కాఁబట్టి దేవర యందుఁ బ్రవేశింపఁదగును.

వత్స—(అంతటను గలయఁ జూచి) ఆహా! ఏమి యీ మకరందోద్యానము యొక్క రమ్యత!

చ. పవడపుఁగాంతి నొప్పెసఁగు పల్లవజాతముచేత నెఱ్ఱనై,
యువలను భృంగరావ మనువ్యక్తము కాని చలోక్తు లొప్పఁగాఁ
బవనవశంబునం గదలి వ్రాలెడి కొమ్మలఁ గూడి, వృక్షముల్
మివుల మధుప్రసక్తి నవె మించెడు మత్తతగన్న కైవడిన్.

సీ. మాలంబునను ద్రొల్లి ముద్దియల్ కమ్మని
సుర నునియుంగ నాపరిమళంబె
నలుగడల నిపుడు నలమెడునో యగఁ
బుష్పవృష్టుల నొప్పఁ బొగడచెట్టు
మధుపానమునను దామ్రము లైన మోములు
నగుటచేఁ బూచిననాఁటిపూలె
విడువక యుండెనా విరులమొత్తముతోడ
భాసిల్లెడు నిదె సంపంగిచెట్టు
కామిను లశోకవృక్షంబుఁ గాలు సాఁచి
తన్ని నప్పటినూపురధ్వనిని వించుఁ
జెలఁగి యామ్రోత ననుకరించెడు నసంగ
భృంగపంక్తులు మ్రోసెడుఁ బ్రియుఁడ వినెదె.

వసం—(ఆలకించి) మిత్రుఁడా! అది తుమ్మెద లందియుల మ్రోత ననుకరించుట గాదు. రాణిగారియొక్కయు పరిజనము యొక్కయు కేవల నూపురశబ్దమే.

[వాసవదత్తయు, కాంచనమాలయు, పూజోపకరణములను గ్రహించి
సాగరికయు, పరివారమును ప్రివేశించుచున్నారు.]

వాస—ఓసీ! కాంచనమాలా! నాకు మకరందోద్యానము నకు మార్గమును గనఁబఱువుము.

కాంచ—దేవీ! ఇదిగో రండి.

వాస—(ముందుకు నడిచి) ఓసీ! కాంచనమాలా! మనము మదనపూజ చేయువలసిన రక్తాశోకవృక్ష మిక్కడ కెంతదూరమున నున్నది?

కాంచ—దేవీ! సమీపములోనే యున్నది. అదిగో చూడు మెప్పుడును విడువకుండఁ బుష్పములతో నిండియుండు మీరు పెంచిన మాధవీలత. అకాలమునందు పూచునట్లు చేయుటకయి యీనుదిన మును రాజుగారు తమమనస్సు నాయాసపెట్టుకొనచున్న నవమాలిక కదా యాపయిఁది? దానిని దాఁటినతోడనే పూజ నిర్వర్తింపవలసిన రక్తాశోకవృక్షము కనఁబడును.

వాస—అట్లయినచో రమ్ము. అక్కడకు శీఘ్రముగాఁ బోదము.

కాంచ—దేవీ! రండి రండి. (అందఱును నడుచుచున్నారు)

వాస—ఇదిగో రక్తాశోకవృక్షముదగ్గఱకు వచ్చితిమి. ఇక్కడ నేను పూజ చేయవలెను. రమ్ము! పూజోపకరణములు తెమ్ము.

సాగ—(దగ్గఱకు వచ్చి) దేవీ! ఇవిగో, అన్నియు సిద్ధముగా నున్నవి.

వాస—(నిరూపించి మనస్సులో) అయ్యో! ప్రమాదము సంభవించినదిగదా! ఇంతకాలము నేనెవరిని రాజుగారియొక్క దృష్టి పథమునందుఁ బడకుండఁ బ్రయత్నముచేతఁ గాపాడుచు వచ్చితినో యామెయే యిప్పుడు రాజుగారికంటఁ బడుట తటస్థించినదిగదా? కానిమ్ము. ఈప్రకారముగాఁ జేసెదను. (ప్రకాశముగా) ఓసీ! సాగరికా! మదనమహోత్సవమునందు పరవశురాండ్రయి యుండు పరిజనమువద్ద శారికను విడిచిపెట్టి యిప్పుడు నీవెందుకువచ్చినావు? పూజోపకరణములను కాంచనమాలచేతికిచ్చి, నీవక్కడకు శీఘ్రముగా వెళ్ళు.

సాగ—దేవిగారియాజ్ఞాప్రకారము చేసెదను. (అలాగునఁ జేసి, కొన్నియడుగులు నడిచి, మనసులో) శారికను సుసంగతచేతి

కిచ్చి వచ్చితిని. ఈపూజ చూడవలెనని నాకు కుతూహలముగా నున్నది. మాతండ్రిగారి యంతఃపురమందుం దేప్రకారముగా నర్చింపఁబడునో చూచి, అక్కడ పూజాసమయముగులోపల నిక్కడ నేనును పూజచేయుటకయి పూవులను గోసి తెచ్చుకొనెదను. (అని నడచి, పూవులు కోయుచున్నది.)

వాస—కాంచనమాలా! అశోకమునందు కామదేవునిం బ్రతిష్ఠింపుము.

కాంచ—దేవిగారి సెలవుప్రకారముచేసెదను. (అప్రకారము చేయుచున్నది.)

వసం—(ముందుకునడిచిచూచి) ఓమిత్రుఁడా! అందెలచప్పుడుఁడగినది గనుక, దేవిగారశోకమూలమునకు వచ్చిరని యూహించెదను.

వత్స—చక్కఁగాఁ గనిపెట్టినావు. చూడు మానె దేవియే కదా?

గీ. పుష్పసుకుమారమైనట్టిమూర్తి దాల్చి
తనుతరంబగుమధ్యంబు తనరుచుండఁ
గమ్మవిల్తునిపార్శ్వభాగమున నున్న
కుసునుచాపమోయన దేవి కొమరుమీఱె.

దగ్గఱగా వెళ్ళుదము రా. (చేరువకు వెళ్లుచున్నారు.)

వత్స—(సమీపించి) ప్రాణేశ్వరీ! వాసవదత్తా!

వాస—(చూచి) నాథా! దేవరకు జయమగుఁగాక! పీఠమును స్వీకరించి దేవరవారీప్రదేశము నలంకరింతురుగాక! ఇదిగో పీఠము. దేవర యిందుఁగూర్చుండుఁడు.

వత్స—(కూరుచున్నాఁడు.)

కాంచ— దేవీ! స్వహస్తములతో నర్పించిన పుష్పములు కుంకుమము, చందనము, వస్త్రము, వీనిచే నలంకరింపఁబడినరక్తాశోక వృక్షముదగ్గఱకు వెళ్ళి, భగవానుఁడయిన మన్మథునర్చింపుఁడు.

వాస— పూజోపకరణములను నాయొద్దకుఁ దీసికొనిరా.

కాంచ— (తీసికొని వచ్చుచున్నది.)

వాస— (పూజ చేయుచున్నది.)

వత్స— ప్రాణనాయికా! వాసవదత్తా!

గీ. క్రొత్తగా మజ్జనంబాడి కొమరుమిగులఁ
దోపుచీరను ధరియించి తుంటవిలుతు
భక్తిఁ బూజించు నీవు ప్రవాళవిటపి
నాశ్రయించినలతవలె నలరె దిపుడు.

గీ. స్మరునిఁ బూజింప హస్తంబు సాఁచి నీవు
ముట్టుకొనుటచేత నశోకభూజ మదిగో
మృదుతరంబగు క్రొంజిగు రొదవినట్లు
కాంతిమీఱెడుఁ జూడు మోకలికి మిన్న.

క. నీపాణిస్పర్శన మిటు
ప్రాపింపఁగరామి నిపుడు పద్మాస్త్రుఁడు సం
తాపించుఁజుమీ తప్పక
యీపట్టునఁ దా ననంగుఁ డిలనగుకతనన్.

కాంచ— దేవీ! మన్మథపూజయయినదిగదా? ఇఁక భర్తకును పూజాసత్కారము సలుపుము.

వాస— అవును. పుష్పములను విలేపనములను దీసికొనిరా.

కాంచి— దేవీ! సర్వమును సిద్ధముగా నున్నది.

వాస— (రాజును పూజించుచున్నది.)

సాగ—(పూలు పట్టుకొని) అయ్యో! పువ్వులు గోయుట యందలి యాశచేత తడవు మసలితిని! ఆసిందువారవృక్షముచాటున దాగియుండిచూచెదను. (చూచి) ఏమీ! అపూర్వముగా మన్మథుఁడు ప్రత్యక్షమే యయినాఁడు! మాతండ్రిగారి యంతఃపురమునందు మన్మథుఁడు చిత్తరువునందు పూజింపఁబడును. ఇక్కడ ప్రత్యక్షమగుచున్నాఁడు. ఇక్కడనేయుంట నేనును భగవంతుఁడయిన యామన్మథుని బూజించెదను. (అని పూవులు వేయుచున్నది) ఓకామదేవా! నీకు నమస్కారము. నాకు శుభదర్శనము కాఁగలదు. చూడఁదగిన పదార్థమును నేనుజూచితిని. నీవునాకమోఘదర్శనుఁడవు కాఁగలవు. (అని ప్రణామము చేయుచున్నది.) ఏమియీయాశ్చర్యము! ఎంతసేపు చూచినను మరలఁచూడదగినవాఁడుగానే యున్నాఁడు! నన్నెవ్వరును జూడకమునుపే నేనిక్కడనుండి పోవలెను. (అని కొన్నియడుగులు నడుచుచున్నది.)

కాంచ—అయ్యా! వసంతకా! ఇప్పుడు నీవునువచ్చి స్వస్తివాచనికముం బుచ్చుకొమ్ము.

వస—(దగ్గఱకు వెళ్ళుచున్నాఁడు.)

వాస—(విలేపన పుష్పాభరణ దానపూర్వకముగా)అయ్యా! ఇదిగో స్వస్తివాచనికముం బరిగ్రహింపుము. (అని యిచ్చుచున్నది.)

[నేపథ్యమునందు వైతాళికుఁడు.]

ఉ. కాంతి సమస్తముం దొలఁగి క్రిన్నన భాస్కరుఁ డస్తమించి సా
యంతనమౌట భూరమణులందఱులందఱు నిందునిఁబోలునీదు కం
జాతరుచిన్హరింపఁగను జాలినపాదము లాశ్రయింప న
త్యంతము గాచియుండెదరు హర్షముతో సభ వత్సభూవరా.

సాగ—(విని, హర్షముతో వెనుకఁదిరిగి రాజునుజూచియుపేక్షతో) ఏమి! మాతండ్రిగారు నన్నిచ్చెదమన్నవత్సమహారాజుగారాయీయన! (నిట్టూర్పు విడిచి) పరులసేవకులగుటచే దూషితమయ్యెను, శరీరమీయనదర్శనముచే సత్కరింపఁబడినది.

వత్స—ఏమి? మనమనస్సులు ఉత్సవములో లగ్నమయిపోయి సంధ్యాసమయ మతిక్రమించినను తెలిసికోఁజాలకున్నాము! దేవీ చూడుము.

గీ. ఉదయతటముమఱుంగున నొదిగి చంద్రుఁ
డుంటఁ బ్రాగ్దిశ సూచించుచున్న దదిగొ
ముందు పాండువర్ణముగలముఖముచేత
వెలఁది హృదయస్థితుండగు ప్రియునిబోలె.

దేవీ! మనము లేచి, యింటికి వెళ్ళుదము. (అందఱును లేచి నడుచుచున్నారు.)

సాగ—అదిగో దేవిగరుబయలుదేఱినారు. నేనుత్వరితముగా వెళ్ళెదను. (రాజును ఆశమీఱఁజూచి నిట్టూర్పువిడిచి) ఏమి! మందభాగ్యురాలయిన నేను యీయనను తడవుచూచుటకయినను వల్లకాకపోయెను! (అని నిష్క్రమించుచున్నది)

వత్స—(నడుచుచు) దేవీ!

సుగంధి. చందురుం దిరస్కరింపఁ జాలు నీముఖాభకున్
గందియంబుజంబు చూడు కాంతిహీన మయ్యెడున్;
వందినీసఖీజనంబుపాట కోడి తుమ్మెదల్
ముందు సిగ్గుచేతఁ ధమ్మిమొగ్గలందు దాఁగెడున్.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

ద్వితీయాంకము.

ప్రదేశము.—ప్రమదావనము

[శారికాపంజరమును చేతఁబట్టుకొని సుసంగత ప్రవేశించుచున్నది]

సుసం—ఈశారికను నాచేతికిచ్చి, నాప్రియసఖ యైనసాగరిక యిప్పుడెక్కడకు వెళ్లియుండును? (ఆవంకఁజూచి) అదిగో నిపుణిక యిచ్చటికే వచ్చుచున్నది. దాని నడిగెదను.

[అంత నిపుణిక ప్రవేశించుచున్నది]

నిపు—రాజుగారు చెప్పిపంపిన యీవర్తమానమును నే నిప్పుడే వెళ్ళి రాణిగారితో చెప్పవలెను. (అని నడుచుచున్నది)

సుసం—చెలియా! నిపుణికా! ఇది యేమి? ఎక్కడనో ధ్యాన మున్నదానివలె, ఇక్కడ నన్నుఁజూడకయే దాఁటిపోవుచున్నావు!

నిపు—సుసంగతవా? చెలియా! నీవు చక్కఁగాఁ గనిపెట్టితివి. నాపరాకునకు కారణము చెప్పెదను వినుము. రాజుగారు శ్రీశైలమునుండి వచ్చిన శ్రీకంఠదాసుఁ డనువానివలన అకాలమున పూలుపూచునట్లు చేయు దోహదమును నేర్చుకొని, తాము పెంచిన నవమాలికను పుష్పసమృద్ధిగలదానినిగాఁ జేయఁదలఁచి, ఆవృత్తాంతము ను రాణిగారితో చెప్పుమని యిప్పుడు నన్నుఁ బంపిరి. నీవు మరల నెక్కడకు వెళ్ళుచున్నావు?

సుసం—ప్రియసఖ యైనసాగరికను వెదకుటకొఱకు.

నిపు—సఖీ! చిత్రఫలకమును లేఖినిని చేతఁబట్టుకొని తొందరగా కదలీగృహమునకు వెళ్ళుచుండఁగా సాగరిక నిప్పుడే నేను చూచినాను. నీవక్కడకు వెళ్ళుము. నేనును రాణిగారికడకుఁ బోయెదను. (అని నిష్క్రమించుచున్నది.)

ప్రదేశము—కదళీగృహము

[చిత్రపుపలకను తూలికను పట్టుకొని, మన్మథావస్థ నటించుచు సాగరిక ప్రవేశించుచున్నది]

సాగ—ఓహృదయమా! శాంతిపొందుము. శాంతిపొందుము. ఒక్కసారి చూచుటవల్లనే యిట్లు సంతాపము వృద్ధిపొందించుచున్న ఆశామాత్రప్రయోజనముగల అదుర్లభపురుషునిమీఁది కోరికచేత ఫలమేమి? (విస్మయముతో) ఆహా! ఏమి నీమూఢత! మరల నతనినే చూచుట కభిలషించుచున్నావు! ఓ పాపపుహృదయమా! జన్మమెత్తినది మొదలుకొని కలసి యేకముగా బెఱిఁగిననన్ను విడనాడి, క్షణమాత్రదర్శనమువలన పరిచితుఁడయినయాతనివెంట వెళ్ళుటకు సిగ్గుపడకున్నావు! ఇందు నీదోష మేమున్నది? మన్మథబాణభీతిచేత నీవట్లు చేయుచున్నావు. కానిమ్ము. నేనిప్పుడు మన్మథుని వేడుకొనియెదను. (కన్నీరు పెట్టుకొని, దోసిలియొగ్గి, మోకాళ్లమీఁదఁగూరుచుండి) భగవంతుఁడ వైనయోయిమన్మథా! సకలసురాసురులను జయించిననీవు స్త్రీజనమును హింసించుట కేల సిగ్గుపడకున్నావు? అదిగాక నీవనంగుఁడవు. ఏవిధముచేతఁ జూచినను మందభాగ్యురాలనయిననాకు ఈనిమిత్తముచేత మరణము సమీపించినట్టున్నది. (పలకను చూచి) ఇక్కడికెవ్వరును రాకమునుపే, చక్కఁగాచూచి నేను కోరినపురుషుని వ్రాసెదను. (శ్రద్ధతో నాకరూపమును వ్రాయఁబూని పలక పుచ్చుకొని, నిట్టూర్పు విడిచి) అతిసాహసముచేత నా కుడిచేయి మిక్కిలి వడఁకుచున్నది. అయినను ఆయనరూపమును దర్శించుటకు మఱియొకయుపాయము లేదు. కాఁబట్టి యేలాగున నయిన ఆయనను వ్రాసి చూచెదను. (అని వ్రాయుచున్నది)

[శారికాపంజరముతో సుసంగత ప్రవేశించుచున్నది]

సుసం—ఇదె కదళీగృహము. నేనిందుఁ బ్రవేశించెదను. (ప్రవేశించి చూచి విస్మయముతో) నాప్రియసఖి యయిన యీ సాగరిక యధికానురాగము కలదానివలె నేమో వ్రాయుచున్నది. అది యగుపడకుండ ఆమెకు కనఁబడకుండ దాఁగియుండి చూచెదను. (ఆమె వెనుకకు మెల్లగావచ్చి నిలుచుండి చూచి సంతోషముతో) ఇది యేమి? రాజుగారిని వ్రాసినది! మేలు! సాగరికా! మేలు! రాజహంసి పద్మాకరమును విడిచి మఱియెక్కడను క్రీడింపఁబోవదు.

సాగ—(కన్నీటితో) దీనిని నేను వ్రాసిన ప్రయోజనమేమి? ఎడతెగకుండ కాఱుచున్నకన్నీటిచేత. నాదృష్టి చూచుటకుఁ జాల కున్నది. (ముఖము పయికెత్తి కన్నీటిని తుడుచుకొనుచు, సుసంగతను జూచి ఉత్తరీయముతో పలకనుమూసి, చిఱునవ్వుతో) ఏమి? ప్రియ సఖీ! సుసంగతా! (అని లేచి చేయిపట్టుకొని) సఖీ! సుసంగతా! ఇక్కడ కూర్చుండుము.

సుసం—(కూర్చుండి బలవంతముగా పలకను పుచ్చుకొని చూచి) సఖీ! నీవిందు వ్రాసిన యీతఁ డెవరు?

సాగ—(లజ్జతో) ఇప్పుడు జరిగినమదనమహోత్సవమునందలి పూజ్యుఁడైన మన్మథుఁడు.

సుసం—(చిఱునవ్వుతో) ఆహా! ఏమి నీ నేర్పు! ఇప్పు డీచిత్రము శూన్యమువలెఁ గనఁబడుచున్నది. నేనుకూడ రతిదేవిని వ్రాసి భార్యాసహితునిఁ జేసెదను. (తూలికను పుచ్చుకొని రతిమిషచేత సాగరికను వ్రాయుచున్నది.)

సాగ—(చూచి క్రోధముతో) సఖీ! నీవిక్కడ నన్ను వ్రాసితివేమి?

సుసం—(నవ్వి) సఖీ! నిష్కారణముగా కోపపడెదవేమి? ఎటువంటి కామదేవుని నీవు వ్రాసితివో, అటువంటి రతీదేవినే నేనును వ్రాసితిని. నన్నన్యురాలినిగా భావించెదవు. ఈమాటలతో నేమి? సర్వవృత్తాంతమును జెప్పుము.

సాగ—(సిగ్గుతో తనలో) అయ్యో! నాప్రియసఖి కంతయుఁ దెలిసిపోయెనే! (ప్రకాశముగా) ప్రియసఖీ! నాకు తగనిసిగ్గు. నే నీలాగునఁ జేసినా నని యీ వృత్తాంతము నెవ్వరికిని దెలియ నీయకుము.

సుసం—సఖీ! సిగ్గుపడకు. ఇటువంటి కన్యారత్నమున కిటువంటి వరునియం దభిలాష మవశ్యకముగాఁ గలుగ వలసినదే. ఈవృత్తాంతము నే నితరుల కెవ్వరికిని దెలియనియ్యను. కాని మేధావినియైన యీశారిక మన మిప్పు డనుకొన్నమాటలను పట్టుకొని యెవ్వరివద్ద నయినను అనునేమో!

సాగ—(తొట్రుపాటుతో) అందుచేత నాకధికతర మయిన సంతాపము కలుగుచున్నది. (అని మదనావస్థ నటించుచున్నది)

సుసం—(సాగరికరొమ్ముమీఁద చేయి యుంచి) సఖీ! ఊఱడుము. ఊఱడుము. ఆ కొలనియొద్దకుం బోయి తామర రేకులను తామరతూండ్లను దీసికొని శీఘ్రముగా వచ్చెదను, (వెళ్ళి తిరిగి ప్రవేశించి పద్మములతోను మృణాలయములతోను శయ్యను రచియించి, మిగిలిన తామర రేకులను సాగరికహృదయమును జేర్చుచున్నది)

సాగ—సఖీ! ఇందువలనను నాకధికతర మయిన సంతాపము కలుగుచున్నది. ఈ నళినీపత్రములను మృణాళవలయములను దీసి

వేయుము. ఇంతతో చాలును. నిష్కారణముగా నీవేల ఆయాస పడెదవు?

గీ. దుర్లభజనాను రాగంబు తొడరె నాకు
నాత్మ వివశ మయ్యెడు లజ్జ యధిక మగుచుఁ
బ్రియసఖీమణి! విషమంబు ప్రేమసురయు
మరణ మొక్కటియే నాకు శరణ మింక.

(అని మూర్ఛపోవుచున్నది.)

సుసం—(ఖేదముతో) ప్రియసఖీ! సాగరికా లెమ్ము. లెమ్ము.

[తెరలో కలకలము]

చ. అరతెగి క్రిందవేలు మెడయందలి బంగరుగొల్సు నీడ్చుచున్
బరువడి ద్వారము ల్గడచి పాదములం జిఱుగంటచాల్ మనో
హరముగ మ్రోయ స్త్రీలుజడియం జెడువానర మశ్వపాలకుల్
తురగవుసాలనుండి వడిఁ ద్రోలఁగ రాజగృహంబుఁ జొచ్చెడున్.

[తెరలోనే మరల]

చ. పురుషులనంగరామి నదె పొల్పఱి వర్షవరు ల్త్రొలంగెడర్
దరమున వామనుండొదిగి దాఁగెడుఁ గంచుకి కంచుకంబులో
సరసనిజాభిధానమును సార్థమొనర్చెద రాకిరాతు, లా
యురుకపి తమ్ముఁ జూచునని యూడనిఁబాడెద రల్లకుబ్జులున్.

సుసం—(ఆలకించి ముందువంకఁ జూచి తొటు)పాటుతో లేచి సాగరిహస్తమును పట్టుకొని) సఖీ! లెమ్ము. లెమ్ము. అదిగో దుష్టవానర మీవంకనే వచ్చుచున్నది.

సాగ—మన మిప్పు డేమిచేయుదము?

సుసం—రమ్ము. ఈతమాలవిటపాంధకారమునందుఁ బ్రవే

శించి యది పోవుదాఁక నుందము. (అని వెళ్ళి యిద్దఱును బెదరి చూచుచు చాటున దాఁగుచున్నారు.)

సాగ—సుసంగతా! నీవు చిత్రఫలకమును విడిచివచ్చితివా యేమి? ఎవ్వరైనను దానిని చూతురేమో!

సుసం—ఓసి సుస్థిరులారా! ఇప్పుడును చిత్రఫలకముతో నేమిచేసెదవు? పెరుగును నన్నమును తినవలె నని యా చెడుకోఁతి శారికాపంజరమును తెఱచి పోయినది. మేధావినియైన యాశారిక మఱియొకవంక నెగిరిపోవుచున్నది గనుక, దాని వెంబడిని వేగిరము వెళ్ళుదము రమ్మా. మనసంభాషణముయొక్క యుత్తరములను గ్రహించిన యాశారిక యెవ్వరిముందయినఁ బలికి పోవును.

సాగ—సఖీ! ఆలాగునఁ జేయుదము.

(అని యిద్దఱును వెళ్ళుచున్నారు.)

[తెరచాటున]

ఇహిహీ! ఆశ్చర్యము! ఆశ్చర్యము!

సాగ—(చూచి) సుసంగతా? మరల నాదుష్టవానరమేవచ్చుచున్నది చూచినావా?

సుసం—(చూచి నవ్వి) ఓసిపిఱికిదానా! భయపడకుు. అతఁడు ప్రభుపార్శ్వవర్తి యగువసంతకుఁడు సుమా.

(అప్పుడు వసంతకుఁడు ప్రవేశించు చున్నాఁడు.)

వసం—ఇహిహీ! ఏమి యాశ్చర్యము! ఏమి యాశ్చర్యము! శ్రీకంఠదాస! ధార్మిక! సాధు సాధు!

సాగ—సఖీ! వీనిని చూచుటవలన నేమి ప్రయోజనము? శారిక దూరముగాఁ బోయినది. కనుక, దాని ననుసరించి వెళ్ళుదము రా.

వసం—సాధు! శ్రీకంఠదాస! ధార్మిక! సాధు! ఆతఁడిచ్చినదోహదమాత్రమున నవమాలిక యిటువంటిదయినది. ఎడములేకుండ వికసించి యున్నపుష్పగుచ్ఛములచేత శోభించు విటపములు గలదై దేవిగారు పెంచుకొన్నమాధవీలతను పరిహసించుచున్నట్టున్నది. ఇది యంతయు నాప్రియమిత్రునకు వెళ్ళి చెప్పెదను. (ముందుకు నడిచిచూచి) అడుగో నాప్రియమిత్రుఁడు. ఈనవమాలికను చూడనివాఁడయ్యెను, అతనిదోహదమునందలి విశ్వాసముచేత నవమాలిక పుష్పితమయి యుండఁగాఁ బ్రత్యక్షమునఁ జూచుచున్నవానివలెనే సంతోషముచేత వికాసము నొందిన కన్నులు గలవాఁడయి యిక్కడకే వచ్చుచున్నాఁడు. ఆతనిదగ్గఱకు వెళ్లెదను.

(అని రాజున కెదురుగా వెళ్ళుచున్నాఁడు)

[అప్పుడు రాజు ప్రవేశించుచున్నాఁడు.]

రాజు—(సంతోషముతో)

సీ. అధికతరోత్కలికాళిచే నలరారి
పాండురవర్ణంబు పరఁగఁ దాల్చి
ప్రారబ్ధజృంభమై మలుమాఱు వెడలెడు
శ్వసనోద్గమంబులఁ జాలఁ దన్ను
నాయాసపఱుచుకొం చభిరామ యయి యున్న
యీలతకూనను జాలవలపు
గొలిపెడుదానిని గుసుమాయుధావస్థ
నత్యంతమును బూని యులరుచున్న
యువ్యకాంతనువలెఁ గన్నులారఁ జూచి
యతిశయంబుగ దేవిముఖాంబుజమును

నిపుడు కోపంబుచేతను నెట్టిపడెడు
నట్లుగాఁ జేయఁగలవాఁడ నరయ నేను.

వసు—(వేగముగా సమీపించి) ప్రియమిత్రా! జయ మగుఁగాక! జయ మగుఁగాక! ఓమిత్రుఁడా! అదృష్టముచేత వర్ధిల్లుచున్నావు!

రాజు—మిత్రుఁడా! సందేహమేమి? మణిమంత్రౌషధముల ప్రభావ మచింత నీయముగదా!

చ. కలన నుపేంద్రుకంఠమణిఁ గాంచి విరోధులు నష్టులైరి, పా
ములును రసాతలంబునకుఁ బోయి వసించెను మంత్రభీతిచే,
వెలయఁగ లక్ష్మణుండుఁ గపివీరులుఁ బూర్వము మేఘనాథుచే
బలమఱి చచ్చి యౌషధపుబల్మిని జీవితు లైరి క్రమ్మఱన్.

మార్గమును గనఁబఱుపుము. ఇప్పుడు మనము దానిని జూచి కన్నులగలఫల మనుభవింతము.

వసం—(ఆటోపముతో) దేవర విజయం చేయుఁడు.

రాజు—నీవు ముందు నడువు.

ఉభయులు—(గర్వముతో) నడుచు చున్నారు.)

వసం—(ఆలకించి భయపడి వెనుకమరలి రాజు చేయిపట్టుకొని తొట్రుపాటుతో) మిత్రుఁడా! రమ్ము పాఱిపోదము.

రాజు—ఎందుచేత?

వసం—ఈవకుళవృక్షముమీఁద నేదో భూత మున్నది.

రాజు—ఛీ! మూర్ఖుఁడా! నిర్భయముగా నడువు. అటువంటి వాని కిక్కడ ప్రభావ మెట్లు కలుగును!

వసం—స్ఫుటాక్షరముతోనే పలుకుచున్నది. నామాటనమ్మ వేని, ముందుకు వెళ్ళి స్వయముగానే వినుము.

రాజు—(ఆలాగుచేసి ఆలకించి)

గీ. స్ఫుటముగా వినఁబడుచు నీసుస్వరంబు
స్త్రీస్వభావమునను గడుఁ దియ్యనగుచుఁ
జూడ నల్పాంగతను జేసి సూక్ష్మ మగుచు
నున్న దది శారిక యటంచు నెన్నువాఁడ.

(పయివంకఁ జూచి) అదిగో శారిక!

వసం—(ఆలోచించి) ఏమీ! సత్యముగా గోరువంకేనా!

రాజు—(చిఱునవ్వుతో) మిత్రుఁడా! అదిగో!

వసం—ఓ చెలికాఁడా! నీవు పిఱికివాఁడవు. ఈశారికను భూతమని తలఁచుచున్నావు.

రాజు—ఓరి మూర్ఖుఁడా! నీవు చేసినదానిని నామీఁద పెట్టుచున్నావు!

వసం—ఆలాగయిన, మిత్రుఁడా! నన్ను వారింపకుము. (రోషములో దండకాష్ఠమును పయికెత్తి) ఓసి బానిసశారికా! వసంతకుఁడు నిజముగానే భయపడునని నీవెఱుఁగవా? ఒక ముహూర్తకాల మిచ్చట నిలువుము. కొండెములు చెప్పువారి మనస్సువలెనే కుటిలమయిన యీకఱ్ఱతో పరిపక్వమయిన వెలగపంటివలె నిన్నీవకుళ వృక్షమునుండి క్రిందపడఁగొట్టెదను.

(అని కొట్టఁబోవుచున్నాఁడు)

రాజు—(వారించి) ఓమూర్ఖుఁడా! అదియేమో మనోహరముగా పలుకుచున్నది. దాని నెందుకు బెదరఁగొట్టెదవు? పలికెడి దానిని విందము.

ఉభ—(వినుచున్నారు)

వసం—ఈబ్రాహ్మణునకు భోజనము పెట్టు మని పలుకు చున్నది.

రాజు—కుక్షింభరుఁడు సర్వమును భోజనవిషయమే పర్యవసితము చేయును. శారిక యేమిపలుకుచున్నదో నిజముగాఁ జెప్పుము.

వసం—(ఆలకించి) మిత్రుఁడా! అది యేమి పలుకుచున్నదో విన్నావా? "సఖీ! నీవిందు వ్రాసిన యీతఁ డెవరు?" అని పలికినది. "ఇప్పుడు జరిగిన మదనమహోత్సవమునందలి పూజ్యుఁ డయిన మన్మథుఁడు" అని పలుకుచున్నది. "సఖీ! నీవిక్కడ నన్ను వ్రాసితి వేమి?—సఖీ! నిష్కారణముగా కోపపడెద వేమి? ఎటువంటి కామదేవుని నీవు వ్రాసితివో, అటువంటి రతీదేవినే నేనును వ్రాసితిని. న న్నన్యురాలినిగా భావించెదవు. ఈమాటలతో నేమి? సర్వవృత్తాంతమును జెప్పుము"—ఓమిత్రుఁడా! ఇది యేమయి యుండును?

రాజు—'ఎవ్వతెయో యొకసుందరి యనురాగముచేత కామదేవుఁడను మిష పెట్టి తనహృదయవల్లభుని వ్రాసి చెలికత్తియకడ మఱుఁగు పెట్టినది. ఆచెలికత్తెయు గుఱుతుపట్టి, నేర్పుతో నామెనే వ్రాసి రతియను మిషచేత చూపినది' అని నే నూహించెదను.

వసం—(చిటికె వేసి) మిత్రుఁడా! సరిసరి! అంతే.

రాజు—చెలికాఁడా! ఊరకుండుము. మరల నేమో పలుకుచున్నది విందము.

ఉభ—(వినుచున్నారు)

వసం—అది మరల నీలాగునఁ బలుకుచున్నది—"సఖీ! సిగ్గుపడకుము. ఇటువంటి కన్యారత్నమున కిటువంటిపరునియం దభిలాష

మవశ్యము గాఁ గలుగవలసినదే'' — అట్లయిన, ఈవ్రాయఁబడిన కన్నియు చూడఁదగినదే.

రాజు—ఇప్పు డవహితుల మయి విందము. ఇక్కడమన వేడుకకు కావలసినంత యవకాశ మున్నది.

వసం—ఓమిత్రుఁడా! నీవే పండితుఁడ వని గర్వపడకుము. దాని ముఖమునుండి సర్వము ను విని నేను వ్యాఖ్యానము చేసెదను.

ఉభ—(వినుచున్నారు)

వసం—మిత్రుఁడా! అది యేమన్నదో విన్నావా!—''సఖీ! ఇందువలనను నా కధికతరమయిన సంతాపము కలుగుచున్నది. ఈ నళినీపత్రములను మృణాళవలయములను దీసివేయుము. ఇంతతో చాలును. నిష్కారణము నీవేల ఆయాసపడెదవు?''

రాజు—వినుటమాత్రమే కాక యభిప్రాయమును సహితము తెలిసికొన్నాఁడను.

వసం—మిత్రుఁడా! నీచమయిన యాశారిక యింకను కురు కురుమనుచునే యున్నది. అంతయు విని వ్యాఖ్యానము చేసెదను.

రాజు—యుక్తమయినమాట చెప్పితివి. మరల విందము.

వసం—ఓమిత్రుఁడా! దానిసహోదరయిన యాశారిక చతుర్వేదములను జదివిన బ్రాహ్మణునివలెనే ఋక్కులు చెప్పుట కారంభించినది!

రాజు—నా మనస్సు మఱియొకదానిమీఁదికిపోయి వినలేదు. ఇప్పుడేమి పలికినదో చెప్పు.

వసం—ఓయీ! ఇట్లు పలుకుచున్నది—

గీ. దుర్లభజనానురాగంబు తొడరె నాకు
నాత్మ వివశ మయ్యెడు లజ్జ యధిక మగుచుఁ,

ప్రియసఖీమణి! విషమంబు ప్రేమ మరయ
మరణ మొక్కటియే నాకు శరణ మింక.

రాజు—(చిఱునవ్వుతో) మిత్రుఁడా! ఇటువంటి దొడ్డబ్రాహ్మణుఁడవు నీవుతప్ప నిట్టిబుఱ్ఱలను తెలిసినవాఁడు మఱి యెవఁడున్నాఁడు?

వసం—శారికపోయిన నిదియేమి?

రాజు—అదిగాథిక.

వసం—గాథికా! అది యెవరిచేఁ జెప్పఁబడినది?

రాజు—మిత్రుఁడా! ప్రియతముని బొందలేనట్టియు శ్లాఘ్యయౌవనవతి యైనట్టియు నొకానొకతెచేత జీవితాశ లేకపోవుటచే పలుకఁబడినది.

వసం—(బిగ్గరగా నవ్వి) ఓయీ! ఈ వక్రభాషణము లేల? 'నన్నే పొందలేనట్టి' యని ఋజువుగానే యేల పలుకరాదు? నీవేగా నియెడల మన్మథుఁ డను మిషచేత మఱుఁగుపఱుపఁదగినవాఁ డన్యుఁ డెవ్వఁ డున్నాఁడు?

(అని చప్పటలుగొట్టి బిగ్గరగా నవ్వుచున్నాఁడు)

రాజు—(పయికిఁ జూచి) ఓరి మూర్ఖుఁడా! నీవు బిగ్గరగా నవ్వుటచేత బెదరి శారిక యెక్కడికో యెగిరి పోయినది.

(అని చూచుచున్నాఁడు)

వసం—(చూచి) మిత్రుఁడా! మఱియొకలాగున తలఁపకుము. అది కదళీగృహమునకే వెళ్ళినది. వెంబడింతము రమ్ము.

(అని వెళ్ళుచున్నారు)

రాజు—గీ. కన్నియలు పుష్పశరబాధఁ గలఁగుచుండి
సఖులముందఱఁ బలికినసంగతులను
చిలుకలును శారికలు నేర్చి పలుకుచుండ
వినెడుధన్యులచెవులకు విందు గాలువు.

చరి దేశము—కదళీగృహము.

[వసంతకుఁడును రాజును ప్రవేశించుచున్నారు.]

వసం—ఓమిత్రుఁడా! ఇదిగో కదళీగృహము. ఇందుఁ బ్రవేశింతము. (ఇద్దఱును ప్రవేశించినమీఁదట) ఓయీ! బానిసకూతురైన శారికయొక్క యన్వేషణప్రయత్న మిఁక చాలును. మలయమారుతముచేఁ గదులుచున్న బాలకదళీదళశీతల మయినయీశిలాతలము నందు ముహూర్తమాత్రము కూర్చుండి విశ్రమింతము.

రాజు—నీయిష్టప్రకారము చేయుదము. (అని కూరుచుండి నిశ్వసించి మరల)—

గీ. కన్నియలు పుష్పశరబాధఁ గలగుచుండి
సఖులముందఱఁ బలికినసంగతులను
చిలుకలును శారికలు నేర్చి పలుకుచుండ
వినెడుధన్యుల చెవులకు విందు గొలువు.

వసం—(ప్రక్కనుజూచి) ఓమిత్రుఁడా! అది దుష్టవానరము. తలుపు తెఱచిపోయిన యీశారికయొక్క పంజర మంనయుండును.

రాజు—మిత్రుఁడా! చూడుము.

వసం—మీరాజ్ఞాపించినట్లు చేసెదను. (సమీపించి చూచి) అదిగో చిత్రఫలకము. దానిని పుచ్చుకొనెదను. (పుచ్చుకొని చూచి హర్షమును కనఁబఱుచుచున్నాఁడు.)